RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
# తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
The Voice of Telangana
Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,
సంపుటి: 15 | సంచిక: 379 | ఎడిటర్ : జేరిపోతుల సంపత్, కరీంనగర్ | బుధవారం 15-4-2026 | పేజీలు: 8 | వెల: రూ. 2.00

తెలంగాణ వాణి
TELANGANA VANI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
R N I No. APTEL/2012/53127
The Voice of Telangana
విలేకరులు కావలెను
తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
9182328292

## మహిళా రిజర్వేషన్ల ముసుగులో
# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

### – కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు



**హైదరాబాద్** మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపాదించిన ప్రోరేటా ప్రకారం నియోజకవర్గాల పెంపు జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోవడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మహిళల సీట్ల సంఖ్య తగ్గి ఆ వర్గాలు నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతిమ లక్ష్యం రాజ్యాధికారం సాధించడమే అన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలకు విఘాతం కలుగుతున్న సందర్భంలో దళితులు, మేధావులు ఈ విషయంపై ఆలోచనలు చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ట్యాంక్‌బండ్ వద్ద ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు.పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించి సమాజంలో సమాన విలువ, గౌరవం కల్పించిన నాయకుడు అంబేద్కర్ అని కొనియాడారు. మహిళా రిజర్వేషన్లతో నియోజకవర్గాల పెంపును ముడిపెట్టి కలగాపులగం చేయాలని ప్రయత్నిస్తున్నారని కేంద్రంలోని ఎన్డీయే సర్కార్‌పై మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పెంపు అని మొదట ప్రస్తావించారని ఇప్పుడు అభివృద్ధి చెందిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని అభ్యంతరం వ్యక్తం చేస్తే దామాషా ప్రకారం 50 శాతం పెంచుతామని చెబుతున్నారని అన్నారు.ఆ ప్రాతిపదిక ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరాలను పెంచుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దక్షిణాదిలో సీట్లు తగ్గడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రిజర్వుడు సీట్లు తగ్గుతాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఏ లెక్కన దక్షిణాది కోటాను తగ్గిస్తారని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల పెంపుపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పిన మాటపై నిలబడే ప్రభుత్వం తమదని పేర్కొన్నారు. చెప్పిన మాట ప్రకారం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేసి చూపించిన రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒక్కటేనని తెలిపారు. కులగణన చేస్తామని చెప్పామని అలా చేసి చూపించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు.మంచి పనికి తెలంగాణ ప్రభుత్వం ముందుంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన మాటలు ఆచరణలోకి రావాలంటే తమ సీట్లను సాధించుకోవాలని చెప్పారు. అప్పుడే మన హక్కుల కోసం

2లో..

## తెలుగు ప్రజలను బంట్రోతులుగా
# చూసిందే కాంగ్రెస్ పార్టీ

### - రేవంత్ రెడ్డి 'బంట్రోతు' వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటర్



హైదరాబాద్ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులపై ఆయన మీడియాతో మాట్లాడుతూ, పునర్విభజన జరిగితే ఇప్పుడు వచ్చిన కేంద్రమంత్రి పదవులు కూడా రాబోవని, బంట్రోతులుగా మారుతారని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేశారు.

2లో..

## కాంగ్రెస్ వైఫల్యాలపై
# పోరాట కార్యాచరణ

### - మే, జూన్ నెలల్లో ప్రత్యక్ష పోరాటాలను ప్రారంభించనున్నట్లు కేటీఆర్ వెల్లడి



హైదరాబాద్ వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై రాబోయే పోరాటాల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 20న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అధినేత కేసీఆర్ హాజరుకానున్నారని కేటీఆర్ తెలిపారు. అనంతరం ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించబోతున్నట్టు వెల్లడించారు. మే, జూన్ నెలల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలపై తొలుత దృష్టి సారించబోతున్నట్లు స్పష్టం చేశారు.కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన డిక్లరేషన్లను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆయన విమర్శించారు. ఏయే ప్రాంతాల్లో ఏయే హామీలు ఇచ్చారో, తిరిగి అదే ప్రాంతాల్లో సభలు పెట్టి ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయాల కోసమే వాడుకుందని మండిపడ్డారు. అంబేద్కర్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవడమే కాకుండా, ఆయనకు భారతరత్న ఇవ్వడంలోనూ, పార్లమెంటులో ఫొటో పెట్టడంలోనూ కాంగ్రెస్ నిర్లక్ష్యం వహించిందని

2లో..

## పాదయాత్రకు వెళ్లే ముందు..
# కవిత ప్రశ్నలకు సమాధానాలు చెప్పు

### - కేటీఆర్ పై మహేశ్ గౌడ్ ధ్వజం



హైదరాబాద్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై, ఆ పార్టీ అగ్రనేతలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం దోపిడీకి గురైందన ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు పదవులు కోల్పోయి విలవిలలాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర చేస్తాననడంపై స్పందిస్తూ ఆయన ఏం చేసినా రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌ను క్షమించే పరిస్థితి లేదని అన్నారు. పదేళ్లలో చేసిన అరాచకాలపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్నారు.

కేటీఆర్ పాదయాత్రకు వెళ్లే ముందు, తన చెల్లెలు కవిత అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. సంతోష్ రావు సంతోషం వెనుక ఉన్న రహస్యం ఏంటి? హరీశ్ రావు ఆనందం వెనుక ఉన్న దోపిడీ ఎంత? అనే విషయాలు కవిత ద్వారానే బయటపడుతున్నాయని సెటైర్లు వేశారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి ఫాంహౌస్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అడుగుతున్న ఆర్థిక లెక్కలకు సమాధానం చెప్పలేక కేసీఆర్ అండ్ కో సతమతమవుతున్నారని అన్నారు. పదేళ్లపాటు అధికార ముసుగులో అడ్డగోలుగా దోపిడీ చేసిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ప్రజల ఆదరణ కోల్పోయి పిచ్చిమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

## తెలంగాణాలో
# ఠారెత్తిస్తున్న ఎండలు

### - ఉదయం 9 నుంచి భానుడి భగభగ




హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారింది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచే భానుడి భగభగతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, హైదరాబాద్, నిర్మల్, కరీంనగర్, వనపర్తి, కొమురంభీమ్ తదితర జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్,

2లో..

# నియోజకవర్గాల పునర్విభజన

### - 543 నుంచి 850కి పెరగనున్న లోక్ సభ స్థానాలు



న్యూఢిల్లీ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ప్రకారం, లోక్ సభ సీట్లు 543 నుంచి 850కు పెరిగే అవకాశం ఉంది. ఈ నెల 16న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి పార్లమెంటరీ వ్యవహారాలశాఖ ఎంపీలకు సమాచారం ఇచ్చింది. బిల్లులకు సంబంధించిన ప్రతులను పంపించింది. పునర్విభజన బిల్లు ప్రకారం రాష్ట్రాల్లో 815 వరకు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలు పెరిగే అవకాశముంది. దీనితో లోక్ సభ స్థానాలు 543 నుంచి 850కి చేరవచ్చుని అంచనా ఉంది. లోక్ సభలో బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్స్ కమిషన్‌ను ఏర్పాటు చేసి సీట్ల పెంపు కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేసి 2029 ఎన్నికల్లో అమలు చేయాలని భావిస్తోంది. సీట్ల పెంపు తర్వాత దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయి. జనగణన తర్వాత వచ్చిన లెక్కల ఆధారంగా రిజర్వేషన్ ఉంటుంది. అన్ని రాష్ట్రాల్లో సగటున లోక్ సభ, అసెంబ్లీ సీట్లను 50 శాతం పెంచాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## లక్షలాది మందిని క్వాంటం
# నిపుణులుగా తీర్చి దిద్దుతాం

### - అమరావతిలో దేశపు తొలి క్వాంటం కంప్యూటర్ల ఆవిష్కరణ




అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి గడ్డపై దేశ సాంకేతిక రంగ చరిత్రలో ఒక నూతన అధ్యాయం లిఖితమైంది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'అమరావతి 1ఎస్', 'అమరావతి 1క్యూ' అనే రెండు క్వాంటం కంప్యూటర్ రిఫరెన్స్ వ్యవస్థలను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ప్రపంచ క్వాంటం దినోత్సవం, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వంటి చారిత్రక ప్రాధాన్యత ఉన్న రోజున ఈ ఘనత సాధించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, భవిష్యత్ టెక్నాలజీలో భారతదేశాన్ని, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలబెట్టడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. అమెరికాకు సిలికాన్ వ్యాలీ ఎలాగో, భారతదేశానికి అమరావతి 'క్వాంటం వ్యాలీ'గా కీర్తి గడిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు."ఈ రోజు చాలా ప్రత్యేకమైనది. ఒకవైపు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి, మరోవైపు ప్రపంచ క్వాంటం దినోత్సవం. విజ్ఞానం ద్వారా సాధికారత సాధ్యమని అంబేద్కర్ చూపిన మార్గంలో పయనిస్తూ,

2లో..

## 15న జలధార అవగాహన కార్యక్రమాన్ని

# విధిగా నిర్వహించాలి

**- కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



**బద్వేలు** జలమే సంపద, జలమే జీవనాధారం.. అన్న సత్యాన్ని ప్రజలు గుర్తెరిగేలా.. 15వ తేదీన జలధార అవగాహన కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో.విధిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు.బద్వేలు నియోజకవర్గ పర్యటనలో భాగంగా.. సోమవారం రాత్రి బద్వేలు ఆర్డీవో కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి.. 'జలధార.. నీటి భద్రత–సాగు నీటి సంఘాల బాధ్యత' అమలు ప్రణాళికపై ఈ నెల న్15న అవగాహన కల్పించే కార్యక్రమంపై.. సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా.. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో నీటి భద్రత అందరి బాధ్యతగా భవించాలన్నారు. నీటి భద్రత మన అందరి సమిష్టి బాధ్యత అని, ఈ విషయంలో జిల్లాలోని సాగు నీటి సంఘాల బాధ్యత అత్యంత కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. నీరు మనందరికీ సర్వస్వమని, నీటిని సంరక్షించుకోడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టడం జరుగుతోందన్నారు. జలధార కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 15న ప్రతి గ్రామంలో జల చిత్రపటం ఆవిష్కరణ చేసి.. గ్రామంలో ప్రతీ ఒక్కరినీ భాగస్వామ్యం చేస్తూ.. అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జలాధార కార్యక్రంలో నీటి వనరుకు సంబంధించి చర్చ జరగాలన్నారు. భూగర్భజల శాఖ వారు అందించే.. ఒక వాటర్ ఆడిట్ రిపోర్టు ఆధారంగా ప్రతి గ్రామంలో, గ్రామ సచివాలయంలో విలేజ్ టెక్నీకల్ అసిస్టెంట్ సహాయంతో.. జల వనరులకు సంబంధించి జల చిత్ర పటాన్ని తయారు చేయాలన్నారు. 15వ తేదీన ఉదయం 10 గంటలకు... జలాధార కార్యక్రమ ఉద్దేశ్యాన్ని చిత్రీకరించాలన్నారు. ఆ గ్రామంలో ప్రధాన నీటి వనరు, చెరువులు, కాలువల అనుసంధానం ఉందా, ఫీడ్ ఛానెల్స్ వున్నాయా ? అనే అన్ని అంశాలకు సంబంధించి.. రాంగోలి చిత్రంగా ఏర్పాటు చేసి.. గ్రామస్తులను ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. నీటి భద్రతా కార్యక్రమంలో రైతులు, సాగునీటి సంఘాల లాంటి భాగస్వాములతో ఈ తరహా కార్యక్రమాలను మరింత ప్రధాన్యతతో పటిష్టంగా చేపట్టాలన్నారు. అందులో భాగంగా నీటి వనరులను గుర్తించడం నీటి భద్రత, సాగునీటి పొదుపు, కొత్త ఆయకట్టు మదుపు, వాగులు, చెరువుల అనుసంధానం, సూక్ష్మ సేద్యం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం.. తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సాగునీటి సంఘాలను పటిష్టం చేసే దిశగా సంబందిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. భూగర్భ జలాలను పెంపొందించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీఓ కార్యాలయం నుండి ఆర్డీవో చంద్రమోహన్, డ్వామా, డీఆర్డీఏ, భూగర్భ జల, మైనర్ ఇరిగేషన్ సంబందిత అధికారులు హాజరవ్వగా... మండలాల నుండి డ్వామా సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తీగలకుంటపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించినసర్పంచ్ మ్యకల స్వర్ణలత



**కోహెడ** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం, తీగలకుంటపల్లి గ్రామంలో కులమత రహిత ఆధునిక భారతదేశం కోసం జీవితకాలం పోరాటం చేసిన రాజ్యాంగ నిర్మాత మహనీయులు భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా..తీగలకుంటపల్లి అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన సర్పంచ్ మ్యాకల స్వర్ణలత–సురేందర్ రెడ్డి, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు యాటల మహేందర్. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాగుల మహేష్, కార్యదర్శి గౌతమ్, వార్డ్ సభ్యులు జాలిగాం మనీషా, సంపత్ దయ్యాల, స్వప్న, మహేందర్ పెరుగు, సంజీవ రెడ్డి, రేవోజు శంకర్, యటల మహేందర్, నక్క పరమేశ్వర్ రెడ్డి, మహిళ సంఘం సిఎ శనగరం పద్మ, అంగన్వాడి టీచర్ దనాబోయన సమ్మవ్వ, కరోబార్ మెట్టు వెంకట్ రెడ్డి, ఆశ వర్కర్స్ పుష్ప, రేవోజు లావణ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో సివి రామన్ జూనియర్ కాలేజ్ విద్యార్థుల ప్రభంజనం




**వనపర్తి** ఇంటర్ మొదటి సంవత్సరం ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో సివి రామన్ కాలేజీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారు సివి రామన్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు 2026 లో విజయ పరంపరను కొనసాగించారు అసాధారణ ఫలితాలను సాధించడంలో సివి రామన్ జూనియర్ కాలేజీకి కె సాధ్యం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అధ్యాపక బృందానికి సివి రామన్ కరస్పాండెంట్ డాక్టర్ కే వీరయ్య అభినందనలు తెలిపారు 900 కు పైగా 130 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు ఎంపీసీ గ్రూపులో 993 మార్కులు మేఘన 992 అక్షయ 992 హన్సిక 992 సానియా 992 స్వాతి 991 శ్రావణి 989 సి ఆర్ సి రెడ్డి 988 తనుశ్రీ 988 కార్తిక అదే విధంగా బైపిసి గ్రూపులో 991 లక్ష్మీనారాయణ 986 సూర్య వర్షిని 979 మధుమోహన్ రెడ్డి 979 కావ్య ఎంఈసి గ్రూపులో 983 నందిని 967 జ్ఞానేశ్వరి సిసి గ్రూపులో 884 ఆర్ వైష్ణవి 828 రామాంజనేయులు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారుఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కే వీరయ్య డైరెక్టర్ వెంకటేశ్వర్లు కుమారస్వామి ప్రిన్సిపాల్ జి వి ఎస్ ప్రకాష్ సీనియర్ అధ్యాపకులు శ్రీధర్ చంద్రశేఖర్ హనుమంతరావు మనీ వర్ధన్ మహేందర్ రమేష్ శేఖర్ గౌడ్ మహేష్ రవి సి.వి.రామన్ కాలేజ్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు

## డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు

**- ఘనంగా నివాళులర్పించిన పోలీస్ కమిషనర్**




**కరీంనగర్** భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో వేడుకలను అత్యంత గౌరవప్రదంగా నిర్వహించారు.కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం కమిషనరేట్ కార్యాలయంలో డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. ఆధునిక భారతదేశ నిర్మాణంలో అంబేద్కర్ చేసిన కృషి అనన్యసామాన్యమని కొనియాడారు. సమానత్వం, న్యాయం మరియు సౌభాతృత్వం ప్రాతిపదికన సమాజాన్ని స్థాపించడానికి ఆయన చేసిన నిరంతర పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ రాజ్యాంగ విలువలను కాపాడాలని సి.పి. గౌష్ ఆలం స్పష్టం చేశారు. ప్రతి పౌరుడికి, ముఖ్యంగా అణగారిన వర్గాలకు హక్కులు అందేలా చూడటం మన బాధ్యత అని అన్నారు. ప్రజా సేవకులు అంబేద్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని చిత్తశుద్ధితో, సామాజిక స్పృహతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కమిషనరేట్‌కు చెందిన అడిషనల్ డీసీపీ వెంకటరమణ, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రజినీకాంత్, జానిమియా, కిరణ్ కుమార్, ఇన్స్పెక్టర్ సరిలాల్ సబ్ ఇన్‌స్పెక్టర్లు మరియు కమిషనరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## బోయిన్ పల్లిలో

# అంబేద్కర్ జయంతి

**- పాల్గోన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి**

**సికింద్రాబాద్** అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని బోయినపల్లి కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడిగా అంబేద్కర్ చరిత్రలో నిలిచారని దేశ ప్రజలందరికీ ఆయన ఆదర్శ ప్రాయుడని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం మూలంగా బడుగు బలహీన అణగారిన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. అంబేద్కర్ వారసత్వాన్ని కొనసాగించాల్సిన ఆవశ్యకత ఉందని గుర్తు చేశారు.

## అంబేద్కర్ మార్గాన్ని అనుసరించాలి

**సికింద్రాబాద్** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా నియోజకవర్గంలో పలు చోట్ల నిర్వహించిన జయంతి కార్యక్రమాలలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. నివాళులు అర్పించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అంటరానితనంతో కులవివక్షకు గురై కూడా ఉన్నత విద్యను అభ్యసించి దేశం గర్వించే అత్యున్నత స్థాయికి అంబేద్కర్ ఎదిగారని గుర్తు చేశారు. ప్రపంచంలో బలమైన ప్రజాస్వామ్య దేశంగా మన దేశం నిలవడానికి కారణమైన వారు రచించిన రాజ్యాంగ విలువలేనని, సమాన అవకాశాలు, హక్కులు అందించి, ప్రతి పౌరుడికి రాజ్యాంగ రక్షణ కల్పించిన వారి ఆశయ సాధనను కీర్తించారు. వారి మార్గాన్ని అనుసరించి నవ భారత నిర్మాణంలో మనందరం పాలుపంచుకోవాలని చెప్పారు.

## అందరికీ ఆదర్శ ప్రాయుడు

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

**- ఉమ్మడి కడప జిల్లా డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి**



**బద్వేలు** బద్వేల్ నియోజకవర్గం బద్వేలు టౌన్ నెల్లూరు రోడ్ లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ సృష్టికర్త, సంఘ సంస్కర్త, అపర మేధావి అయిన భారతరత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారు దేశానికి దిక్సూచిని అందించిన మహానుభావుడని కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం, విద్య వంటి విలువలను సమాజానికి పరిచయం చేసి మార్గదర్శకుడిగా నిలిచారని అన్నారు.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని ఉమ్మడి కడప జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్,అరవ శ్రీనివాసుల రెడ్డి,పాలకొండ రాజశేఖర్ రెడ్డి,ఆర్య వైశ్య కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పరిటాల వెంకట సుబ్బయ్య, కడప జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు జహంగీర్ భాష,ఓబుల రెడ్డి రమణ రెడ్డి,బిజీవేముల రమణారెడ్డి, బీజేముల చంద్ర శేఖర్ రెడ్డి,పఠాన్ మౌలాలి,గోపి రెడ్డి,మాచుపల్లి కృష్ణారెడ్డి,బోవిళ్ళ నరసింహారెడ్డి,సిమెంట్ సుబ్బారెడ్డి,పసుపులేటి ప్రసాద్,గురు ప్రసాద్ రెడ్డి, గంగాధర్ రెడ్డి,మహేశ్వర్ రెడ్డి ,సాంబశివ రెడ్డి,నవీన్ కుమార్ రెడ్డి, బ్రహ్మదండ శ్రీనివాసులు,గంగిపోగు నరసింహులు,ఎద్దుల ప్రసాద్ మాజీ జడ్పీటీసీ,అంబేద్కర్ విగ్రహ కమిటీ సభ్యులు చెంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ల ముసుగులో

# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

మాట్లాడగలమని ఈ విషయంలో మేధావులు ఆలోచన చేయాలని కోరారు.దళితులు, గిరిజనులు, మైనారిటీలు, మహిళలకు సమాన అవకాశాలు కల్పించవచ్చని మార్గదర్శకం చేసిన మహానాయకుడు అంబేద్కర్ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్య ఒక్కటే అన్ని సమస్యల నుంచి మనల్ని విముక్తి చేస్తుందని, జీవితాల్లో వెలుగులు నింపుతుందని, సమాజంలో సరైన గౌరవం దక్కుతుందని బలంగా విశ్వసించారని గుర్తుచేశారు. అంబేద్కర్ ఆలోచనే తెలంగాణలో తమ ప్రజాపాలన విధానమని పేర్కొన్నారు.రక్తం చిందించకుండా శాంతితో యుద్ధాన్ని గెలవొచ్చని మహాత్మగాంధీ గారు ప్రపంచ దేశాలకు చాటిచెబితే ఆ దేశాన్ని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా పరిపాలించవచ్చని నిరూపించిన వారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. ఈ దేశానికి మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రెండు కళ్లలాంటి వారని చెప్పారు.భారత రాజ్యాంగంలో అంబేద్కర్ గారు జోడించిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలే ముందు భాగంలో నిలిచి పోరాటం చేశారని తెలిపారు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన గద్దరన్న, మారుమూల పల్లెల్లో జయ జయహే తెలంగాణను మారుమోగించిన అందెశ్రీను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు.దళిత, గిరిజన సామాజిక వర్గానికి మంత్రిపదవులు, ఇతర పదవులు, అధికారులకు ప్రాధాన్యత విషయాల్లో గత ప్రభుత్వాలకు, ప్రజాప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను పోల్చుకోవాలని ప్రజలను కోరారు. ప్రజా ప్రభుత్వంలోనే అత్యధిక ప్రాధాన్యత దక్కిందని అనేక ఉదాహరణలు చెప్పారు.కులాల మధ్యన విభజన జరుగుతుందని, సమాజంలో మరింతగా అంతరాలు పెరుగుతున్నాయని ఆలోచన చేసి ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దేశానికి భవిష్యత్తును అందించే దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల పేదలకు నాణ్యమైన విద్య అందడం లేదని, నాణ్యమైన విద్యను అందించడానికి అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు.రాష్ట్రంలో ఇచ్చిన 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లలో అత్యధికంగా దళితులకు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 67 వేల ప్రభుత్వ ఉద్యోగాలు నియమిస్తే అందులో 87 శాతం ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు ఉద్యోగాలొచ్చాయని తెలిపారు. ఒకవైపు అప్పులు, తప్పులను సవరిస్తూనే రాష్ట్రంలో పరిపాలనను చక్కబెడుతూ ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి అందించాలన్న మంచి లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని తెలిపారు.

## తెలుగు ప్రజలను బంట్రోతులుగా చూసిందే కాంగ్రెస్ పార్టీ

తెలుగు ప్రజలను బంట్రోతులుగా చూసిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. అంజయ్య, ఇతర ముఖ్యమంత్రులను కాంగ్రెస్ పార్టీ ఎలా అవమానించిందో అందరికీ తెలుసని అన్నారు. జనాభా ప్రాతిపదికన పెంచితే దక్షిణాదికి నష్టమని ఇన్నాళ్లు అన్నారని, ప్రతి రాష్ట్రంలో కనీసం 50 శాతం సీట్లు పెంచుతుంటే కూడా రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దక్షిణాదికి బీజేపీ కీలక పదవులు ఇవ్వలేదని రేవంత్ రెడ్డి చెప్పిన వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి స్పందించారు.ఉపరాష్ట్రపతి పదవులు చేపట్టిన వెంకయ్యనాయుడు, సీపీ రాధాకృష్ణన్ దక్షిణాదివాళ్లు కాదా అని ప్రశ్నించారు. ఎంపీ లక్ష్మణ్ ఉత్తరాదికి వలసపోతారని విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్ వదిలిపెట్టి కేరళకు రాలేదా అని నిలదీశారు. దక్షిణాది ముఖ్యమంత్రులు ఢిల్లీకి వెళితే రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి రేవంత్ రెడ్డి పంపించే డబ్బుతోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తోందని విమర్శించారు. జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాది నష్టపోతుందనే ఆలోచనతో మోదీ రాష్ట్రాలకు కనీసం 50 శాతం సీట్లు పెంపు ప్రతిపాదన తీసుకువచ్చారని తెలిపారు. కానీ గతంలో ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు కేటాయించింది కాంగ్రెస్ పార్టీయేనని ఆరోపించారు. ఈసారి జనగణనతో పాటు కులగణన చేస్తున్నట్లు చెప్పారు. దీనికి సమయం తీసుకుంటుందని కిషన్ రెడ్డి అన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాట కార్యాచరణ

ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించకుండా గేట్లు వేస్తే, తాము హెచ్చరించిన తర్వాతే గేట్లు తెరుచుకున్నాయని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీలు మోసపోయారని, వెయ్యికి పైగా గురుకులాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ అరాచక పాలనపై బీఆర్ఎస్ గట్టిగా నిలదీస్తుందని అన్నారు.

## తెలంగాణాలో ఠారెత్తిస్తున్న ఎండలు

ఖమ్మం జిల్లాల్లో బుధవారం వడగాలులు వీచే అవకాశం ఉంది. నేడు, రేపు ఉత్తర, దక్షిణ తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఎండ తీవ్రత 41 నుంచి 44 డిగ్రీల వరకు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, నేడు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. గురువారం నుంచి ఎండల తీవ్రత మరింత ఎక్కువ కానున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

## లక్షలాది మందిని క్వాంటం నిపుణులుగా తీర్చి దిద్దుతాం

వాస్తవ పరిస్థితుల్లో పరీక్షించడానికి, ధ్రువీకరించడానికి వీలు కల్పించే పూర్తిస్థాయి టెస్ట్‌బెడ్‌లు అని వివరించారు.ఇప్పటివరకు పరిమితంగా ఉన్న క్వాంటం హార్డ్‌వేర్ యాక్సెస్, ఈ సౌకర్యాలతో పరిశోధకులు, స్టార్టప్‌లకు అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. "పార్లమెంటు అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తించి మాపై నమ్మకం ఉంచింది. ఈ రోజు, ఈ రాజధాని నుంచే దేశానికి ఈ క్వాంటం సౌకర్యాలను కానుకగా అందిస్తున్నందుకు గర్వంగా ఉంది," అని చంద్రబాబు పేర్కొన్నారు.భవిష్యత్తు క్వాంటం కంప్యూటింగ్‌దేనని నొక్కిచెప్పిన చంద్రబాబు, ఈ సాంకేతికతను అభివృద్ధి చేసే దేశాలే ప్రపంచాన్ని శాసిస్తాయని అన్నారు. "నిన్నటి వరకు టెక్నాలజీ ఆవిష్కరణల కోసం అందరూ సిలికాన్ వ్యాలీ వైపు చూసేవారు. కానీ నేటి నుంచి, ఎవరైనా తమ ఆవిష్కరణలను ప్రారంభించాలన్నా, పరీక్షించాలన్నా అమరావతిలోని క్వాంటం వ్యాలీకి రావాలి. అమెరికాకు సిలికాన్ వ్యాలీ ఉంటే, భారతదేశానికి అమరావతిలో క్వాంటం వ్యాలీ ఉంటుంది" అని ఆయన ఉద్ఘాటించారు. అమరావతి కేవలం ఒక నగరం కాదని, ఇంద్రుడి నివాసమైన అమరావతి పేరుతో అత్యుత్తమ భవిష్యత్ నగరంగా దీనిని నిర్మిస్తామని పునరుద్ఘాటించారు. కాలుష్యరహిత, హరిత ఇంధన ఆధారిత, అత్యుత్తమ జీవన ప్రమాణాలున్న నగరంగా అమరావతి రూపుదిద్దుకుంటుందని తెలిపారు.ఈ క్వాంటం వ్యవస్థల రూపకల్పన పూర్తిగా దేశీయ సరఫరా గొలుసుతో జరగడం ఒక చారిత్రక మైలురాయి అని చంద్రబాబు అభివర్ణించారు. ఇది కేవలం శాస్త్రీయ విజయం మాత్రమే కాదని, జాతీయ సామర్థ్యానికి ప్రతీక అని అన్నారు. "మనం ఆధారపడటం నుంచి ఆత్మనిర్భర సామర్థ్యం వైపు, భాగస్వామ్యం నుంచి నాయకత్వం వైపు పయనిస్తున్నాం," అని తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమంలో టీఐఎఫ్ఆర్ ముంబై, ఐఐఎస్‌సీ బెంగళూరు, డీఆర్‌డీఓ, అంబర్ ఎంటర్‌ప్రైజెస్, క్యూబిట్ ఫోర్స్ వంటి అనేక జాతీయ సంస్థల భాగస్వామ్యాన్ని ఆయన ప్రశంసించారు. ఢిల్లీ నుంచి ముంబై, బెంగళూరు నుంచి అమరావతి వరకు వివిధ సంస్థలు ఒకే లక్ష్యంతో పనిచేసి దీనిని సాకారం చేశాయని కొనియాడారు.టెక్నాలజీని అర్థం చేసుకుని, ప్రోత్సహించే నాయకుడు సరైన సమయంలో ఉండటం దేశ అదృష్టమని, ప్రధాని నరేంద్ర మోదీ ఆ కోవకు చెందిన వారని చంద్రబాబు ప్రశంసించారు.

## ప్లేట్ ఫిరాయించి... అలా దొరికిపోయాడు

**హైదరాబాద్** అక్రమార్కులను.. దుర్మార్గులను.. మోసగాళ్లను ఇలా ఎంతోమందిని పోలీసులు జైలుకు పంపించి ఉంటారు. వారు చేసే అన్యాయాల మీద ఉక్కు పాదం మోపి ఉంటారు. కానీ ఈ తరహా మోసాన్ని ఎన్నడూ చూసి ఉండరు. కనీసం సినిమాల్లో కూడా వాళ్లు ఎరిగి ఉండరు. ఎందుకంటే మోసంలో ఇతడు పీహెచ్డీ కాదు, అంతకుమించి చేశాడు. తన నరనరంలో మోసాన్ని జీర్ణించుకున్నాడు. చివరికి పోలీసులను బురిడీ కొట్టించబోయి.. లాస్ట్ మినిట్ లో దొరికాడుహైదరాబాద్ నగరంలో సాయంత్రం దాటితే చాలు పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడతారు. ముఖ్యంగా జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ఖరీదైన ప్రాంతాలలో రాత్రిపూట విస్తృతంగా తనిఖీలు చేపడతారు.. తాగుబోతులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపిస్తారు. భారీ తాగుబోతులకు జరిమానా విధిస్తారు. అంతకుమించితే వాహనాలను సీజ్ చేసి.. కోర్టుకి ఈడుస్తారు. ఇది రొటీన్ ప్రక్రియ. డ్రంకెన్ డ్రైవ్ లో ఎంతటి తోపులైనా సరే దొరికి పోవాల్సిందే. ఎందుకంటే హైదరాబాద్ పోలీసులు వేసే స్కెచ్ చాలా ఉంటుంది మరి. కానీ ఇతడు ఏకంగా పోలీసులకే చుక్కలు చూపించాడు.హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్రాంతంలో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఓ కారు అతివేగంగా వచ్చింది. దీంతో పోలీసులు ఆ వాహనాన్ని ఆపారు. దాని నడుపుతున్న వ్యక్తిని పరీక్షించారు. ఈలోగా పోలీసులు మరో వ్యక్తి వాహనాన్ని ఆపారు. అతడిని తనిఖీ చేస్తుండగా.. ఈ కారు నెంబర్ ప్లేట్ మారడాన్ని గమనించారు. ఒకసారిగా పోలీసులు ఆశ్చర్యపోయారు. ఇలా ఎలా జరుగుతుందంటూ తమలో తామే ప్రశ్నించుకున్నారు. చివరికి ఆ కారులో ఉన్న వ్యక్తిని కిందికి దింపి.. నెంబర్ ప్లేట్ మార్చే విధానాన్ని చూసి ఒకరకంగా షాక్ గురయ్యారు.

## అగ్నిమాపక వారోత్సవాల
# గోడప్రతులు ఆవిష్కరణ

**ఫైర్ సేఫ్టీపై ప్రజల్లో అవగాహన పెంచాలి**

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**




నిర్మల్ (తెలంగాణ వాణి ప్రతినిధి) నిర్మల్ జిల్లా కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గోడప్రతులను ఆవిష్కరించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న వారోత్సవాలను సమర్థవంతంగా, ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అగ్నిప్రమాదాల నివారణలో ముందస్తు జాగ్రత్తలు అత్యంత కీలకమని తెలిపారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, పెట్రోల్ బంకులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, జనసంచారం అధికంగా ఉండే ప్రదేశాలలో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజల్లో ఫైర్ సేఫ్టీపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు, డెమోలు, శిక్షణ శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులకు అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్, అధికారులు శివాజీ తదితరులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భైంసాలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



భైంసా (తెలంగాణ వాణి ప్రతినిధి)భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా భైంసా పట్టణంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు అపారమని, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని యువతకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆలోచనలు దేశ నిర్మాణానికి దారిదీపంగా నిలిచాయని పేర్కొన్నారు. భైంసాలో అంబేద్కర్ భవన నిర్మాణానికి రూ.50 లక్షల నిధులను త్వరలో మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్, మోహన్ రావ్ పటేల్, విలాస్ గాదేవార్,శంకర్ చంద్రే, డాక్టర్లు దామోదర్, నాగేష్ కౌన్సిలర్లు వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో
## ఆదర్శ పాఠశాల విద్యార్థి ప్రతిభ




ధర్మారం (తెలంగాణ వాణి) మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న సంపతి రక్షిత రాష్ట్రస్థాయి సీనియర్ ఫెడరేషన్ కప్ అథెటిక్స్ హైమార్ త్రో పోటీలలో మూడో స్థానం సాధించి కాంస్య పథకాన్ని సాధించిందని ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్ తెలిపారు. ఈనెల 11 నుండి 12 వరకు హనుమకొండ జిల్లాలలో జెఎన్ఎస్ స్టేడియంలో జరిగిన 11 వ రాష్ట్ర స్థాయి సీనియర్ ఫెడరేషన్ కప్ లో అథ్లెటిక్స్ హైమర్ త్రోలో అండర్ 20 విభాగంలో మూడవ స్థానం సాధించి కాంస్య పథకాన్ని పొందడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మంగళవారం విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బైకనీ కొమురయ్య, మేకల సంజీవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మే 13 వరకే శుభకార్యములకు అవకాశం



పటాన్ చెరు, ఏప్రిల్ 13, (తెలంగాణ వాణి రిపోర్టర్) మే 13 వ తేదీ వరకు అన్ని రకాలైన శుభ కార్యాలకు అవకాశం ఉందని రాష్ట్ర అర్చక సంఘం ఉపాధ్యక్షులు గుడి చంద్ర శేఖర్ ఒక ప్రకటన లో తెలిపారు. తర్వాత ఒక నెల రోజుల పాటు అధిక జ్యేష్ఠ మాసం ఉన్నందున నిశ్చితార్థం , వివాహాలు, గృహ ప్రవేశాలు, ఉప నయనాలు, అన్న ప్రాశన, అక్షరాభ్యాసం, తదితర శుభ కార్యాలు చేయ కూడదన్నారు. తిరిగి ఒక నెల రోజుల అనంతరం నిజ జ్యేష్ఠ మాసం లో అంటే జూన్ 20 నుండి మళ్ళీ నెల రోజుల పాటు అన్ని రకాల శు భ కార్యాలు నిరభ్యంతరంగా చేసుకోవచ్చాన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించి తమ ఇంటి శుభ కార్యాలు తగు విధంగా రూపకల్పన చేసుకోవాలని ముందస్తు ప్రకటన గా గుడి చంద్రశేఖర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# జిల్లాలో ఘనంగా డా.బిఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు



ఆదిలాబాద్ (తెలంగాణ వాణి ప్రతినిధి) భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్.అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో బాబా సాహెబ్ డా.బిఆర్.అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్, ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషలతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి, జెండాను ఆవిష్కరించి ఘనంగా నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు, విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాటలు ఆహ్వానితులను అలరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించి, వివిధ పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, బహుమతులను కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, గ్రంథాలయ చైర్మన్, మున్సిపల్ చైర్ పర్సన్ లు అందజేశారు. అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఆరైవ్–అలైవ్ రోడ్డు భద్రత పోస్టర్ లను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రాణాదత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, స్టాంపులతో రూపొందిస్తున్న అంబేద్కర్ చిత్రపటంపై కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు జైభీమ్ స్టాంప్ ను వేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా ప్రజలకు అంబేద్కర్ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం మనం అనుభవిస్తున్న వాక్ స్వాతంత్ర్యం, సమానత్వం కేవలం అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే సాధ్యమయ్యాయని కొనియాడారు. దేశంలో ఎన్ని కులాలు, మతాలు ఉన్నప్పటికీ అందరూ శాంతియుతంగా కలిసి ఉండడానికి రాజ్యాంగమే దిక్సూచి అని సూచించారు. ముఖ్యంగా విద్య యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, "బోధించు, సమీకరించు, పోరాడు" అనే అంబేద్కర్ పిలుపును గుర్తుచేశారు. జిల్లాలో విద్యా ఫలితాలను పరిశీలిస్తే బాలికలు మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నారని, బాలురు సైతం చదువుపై మరింత దృష్టి సారించి సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. యువతకు కేవలం ఇంజనీరింగ్, డాక్టర్ వృత్తులే కాకుండా డిజిటల్ మార్కెటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక రంగాలలో శిక్షణ ఇచ్చేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. ఇందులో భాగంగా 10 పాఠశాలల్లో 'లెర్న్ స్మార్ట్ విత్ ఛా×' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. సంక్షేమ రంగంలో భాగంగా ఎస్సీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పన, ఆరో వాటర్ ప్లాంట్లు, గీజర్ల ఏర్పాటు వంటి పనులు పూర్తి చేశామని వివరించారు. అలాగే జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం మూడు 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' నిర్మిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలని, హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని స్పష్టం చేశారు. అభివృద్ధి చెందిన భారతాన్ని నిర్మించడంలో ప్రతి పౌరుడు అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నిజాయితీతో కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమాజంలో సమానత్వం, సమన్యాయం సాధించడమే మన లక్ష్యం కావాలని అన్నారు. ప్రపంచ దేశాలు భారత్ విచ్ఛిన్నం అవుతుందని భావించినా, అంబేద్కర్ అందించిన అద్భుతమైన రాజ్యాంగమే నేడు మనల్ని ప్రపంచ నాయకుడిగా నిలబెట్టిందని కొనియాడారు. రాజ్యాంగంలోని సామాజిక సూత్రాలను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో అమలు చేసినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. అంబేద్కర్ సూచనల మేరకు శాంతిభద్రతలను కాపాడటంలో జిల్లా పోలీస్ యంత్రాంగం అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో 60 రోజుల్లోనే విచారణ పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూరుస్తున్నామని వివరించారు. చట్టం ముందు అందరూ సమానులేనని, బాధితులకు న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించడమే తమ ప్రాధాన్యత అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబేద్కర్ అందించిన రాజ్యాంగ స్ఫూర్తి వల్లే నేడు భారతదేశం ప్రపంచ దేశాలకు నాయకత్వం వహించే స్థాయికి చేరుకుందని కొనియాడారు. కేవలం హక్కులకే పరిమితం కాకుండా పౌరుల బాధ్యతలను కూడా గుర్తెరగాలని సూచించారు. దళిత వర్గాలు కేవలం రిజర్వేషన్లపైనే ఆధారపడకుండా, జనరల్ కోటాలో కూడా అవకాశాలు సాధించి అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. విద్యే అసలైన ఆయుధమని, అంబేద్కర్ కష్టపడి చదివి సాధించిన ప్రగతి అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులతో పాటు సాధారణ బ్యాంకింగ్ పథకాలను సైతం సద్వినియోగం చేసుకోవాలని, దళిత జాతి అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ, అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి ఫలాలు లభిస్తున్నాయని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అనంతరం ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ పొంది గ్రూప్ 2 ఉద్యోగం సాధించిన జైనథ్ మండలం ఆడ గ్రామానికి చెందిన అవినాష్ ను శాలువాతో కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీలు సన్మానించి, వనిత డైరెక్టర్ గా అంబేద్కర్ జీవిత చరిత్ర పై రూపొందించిన వీడియో సిడిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఎస్సీ సంక్షేమ అధికారి సునీత కుమారి, బిసి సంక్షేమ అధికారి సోనియా, ఆర్డీఓ స్రవంతి, ఈడి మనోహర్, రవాణా శాఖ అధికారులు రవీందర్, శ్రీనివాస్, హరీంద్ర, వార్డుల కౌన్సిలర్లు, కుల సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, ప్రజలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రమశిక్షణ, ఉన్నత విలువలతో కూడిన విద్యని అందించాలి

**మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**



చౌటుప్పల్, ఏప్రిల్ 14 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి) చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రం లో ఉన్న మల్లికార్జున ఒలంపియాడ్ స్కూల్లో మంగళవారం గ్రాడ్యువేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ హాజరై చిన్న పిల్లలకు సర్టిఫికెట్లు వారి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం చైర్మన్ పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు మరియు చిన్నతరం నుండి విద్యని నిరంతరం అభ్యసించే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అందుకుంటారని చిన్నపిల్లలకు క్రమశిక్షణ ఉన్నత విలువలతో కూడిన విద్యని అందించడం ద్వారా సమాజంలో ఉన్నత పదవులలో ఉండి సమాజానికి సేవ చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోశిక వినయ్, ఎంఈఓ గురువరావు,మల్లికార్జున హై స్కూల్ చైర్మన్ మారపల్లి మల్లారెడ్డి, డైరెక్టర్లు భీమిడి ధరణి, మారపల్లి తేజస్విని, ప్రిన్సిపాల్ కన్నయ్య మరియు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



చౌటుప్పల్,ఏప్రిల్ 14 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి) చౌటుప్పల పురపాలిక తో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. చౌటుప్పల పురపాలిక లోని లింగోజిగూడెం స్టేజి వద్ద ఉన్న బీ ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదల పావని రమేష్ గౌడ్, వ్యవసాయ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, కౌన్సిలర్ పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ బండమీది మల్లేష్, లింగోజిగూడెం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పర్నె శివారెడ్డి తదితర నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగోని నవీన్ యాదవ్, బోసి హరిబాబు, తీగల రాజు, అనుమాస్పేట లింగస్వామి, కళ్లెం దయాకర్ రెడ్డి, ఎర్రగోని లింగస్వామి, శివమహదేవ దేవాలయ చైర్మన్ బండమీది ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యువకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి



కొమురవెల్లి (తెలంగాణ వాణి ప్రతినిధి) సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని రసులాబాద్ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయ దూత డాక్టర్ బాబాసాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా రసూలాబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని జనగామ శాసనసభ్యులు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ శుభ సందర్భంగా గ్రామస్తులు, అంబేద్కర్ అభిమానులు, స్థానిక నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం జరిగిన సభలో డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "డాక్టర్ అంబేద్కర్ దళిత, వెనుకబడిన, పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలా కృషి చేశారు. ఆయన ఆశయాలు , సమానత్వం, సామాజిక న్యాయం, విద్యా హక్కు ఇప్పటికీ మనందరికీ మార్గదర్శకాలు. ఈ విగ్రహం రసూల్ గ్రామంలోని యువతకు, ప్రజలకు స్ఫూర్తినిస్తుంది" అని అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా స్థానికంగా అంబేద్కర్ భావాలను మరింతగా ప్రచారం చేసే అవకాశం ఏర్పడిందని, గ్రామ అభివృద్ధి, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో ప్రజలు ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామస్తులు ఈ విగ్రహాన్ని స్వయంగా నిర్మించుకోవడం సామాజిక చైతన్యానికి నిదర్శనమని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ సమితి సభ్యులు, సామాజిక సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా రసులాబాద్ గ్రామం నిర్వహించిన ఈ చిన్న కార్యక్రమం పెద్ద స్ఫూర్తిని ఇస్తోంది.సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలన్నారు.ఈ విగ్రహం రసూలాబాద్ గ్రామ ప్రజలందరికీ శాశ్వత స్ఫూర్తి కేంద్రంగా నిలుస్తుందన్నారు.

## డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు



రాజపేట: 14ఏప్రిల్ (తెలంగాణ వాణి విలేకరి) యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మల్యాల భరత్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు జరిగాయి. అన్నదాన కార్యక్రమం కూడా చేశారు. ఉపాధ్యక్షులు చింతల సాయి కుమార్ ముఖ్య అతిథిలుగా సర్పంచ్ కోయ మధు ఎస్సై లింగారెడ్డి, ఏఎస్ఐప్రకాష్ ఉపసర్పంచ్ నమిలే కేదారి వార్డు సభ్యులు,మాజీ ఎంపీటీసీ ఎర్రగొకుల కృష్ణ మాజీ అధ్యక్షులు చింతల కోటయ్య, చింతల దేవదాసు కూతురు లింగం విగ్రహా దాత చింతల రవీందర్ సట్టు తిరుమలేష్ గౌటే లక్ష్మణ్ ఆడెపు శ్రీశైలం ఎర్రగొకుల జశ్వంత్ మాజీ ఎంపీటీసీ దాచేపల్లి రాజు దాచేపల్లి శ్రీనివాస్ సంధిల భాస్కర్ గుర్రం నర్సింలు జూకంటి ప్రవీణ్ రెగు సిద్దులు కిషన్ సింగ్ శంకరయ్య లక్ష్మణ్ మధు బీరయ్య సిద్దులు గుర్రం పాండు నాగార్జున వివిధ యువజన సంఘాల నాయకులు అఖిలపక్ష నాయకులు గ్రామ ప్రజలు యువకులు మహిళలు అంబేద్కర్ యువజన సంఘం యూత్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలే సమాజానికి మార్గదర్శకం

**మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి.**





చండూర్ (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి) మునుగోడు నియోజకవర్గం చండూర్ మండలం బోడంగ్‌పర్తి గ్రామంలో భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి విగ్రహావిష్కరణ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్ హాజరై అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులు అర్పించారు. ఈ విగ్రహ ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించిన ప్రభాకర్ రెడ్డి ని గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ భారతదేశానికి అందించిన రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన హక్కులు కల్పించే మహత్తర గ్రంథమని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ ఆలోచనలు మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి, సమానత్వం, న్యాయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారని అన్నారు.అదే విధంగా తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మునుగోడు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ సరఫరా, పాఠశాలల అభివృద్ధి వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. బోడంగ్‌పర్తి సహా పరిసర గ్రామాల అభివృద్ధికి కృషి చేసినట్లు గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటానని గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం , స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొని అంబేద్కర్ గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సంకల్పించారు.

# వడాయిగూడెంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



భువనగిరి (తెలంగాణ వాణి విలేకరి) వడాయిగూడెం గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా టీయూడబ్ల్యూజే (హెచ్-143) రాష్ట్ర కార్యదర్శి గుండు ముత్తయ్య గౌడ్, సర్పంచ్ నీల శిరీష ఓం ప్రకాష్, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కోట అంజయ్యలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానిక పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గుండు ముత్తయ్య గౌడ్ మాట్లాడుతూ సామాజిక సంస్కర్తగా భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడిగా భారత దేశపు తొలి న్యాయ శాఖ మంత్రిగా అంబేద్కర్ పోషించిన పాత్ర మన జాతి నిర్మాణంలో కీలక పాత్ర వహించిందన్నారు. నేడు ఆయన 135వ జయంతిని దేశం మొత్తం గొప్పగా జరుపుకుంటుందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడిని జాతి నిర్మాణంలో భాగమయ్యేలా కృషి చేసేందుకు అడుగులు వేయించడంలో ఆయన ఆలోచనలోని అసాధారణ స్ఫూర్తి ప్రేరణ చాలా ఉపయోగపడతాయని తెలిపారు. భారత 77 ఏళ్ల స్వతంత్రాన్ని పురస్కరించు కొని దేశవ్యాప్తంగా 'స్వాతంత్ర్య అమృత మహోత్సవాలు' జరుపుకుంటున్న నేపథ్యంలో అంబేద్కర్ ఆలోచనలోని గాంభీర్యాన్ని జాతి నిర్మాతగా ఆయన పోషించిన పాత్ర దేశాన్ని గొప్ప శక్తిగా ఎదిగేలా సామాజికంగా అన్ని వర్గాలను బలోపేతం చేసేలా ఆయన పోషించిన పాత్ర దేశాన్ని గొప్ప శక్తిగా ఎదిగేలా సామాజికంగా అన్ని వర్గాలను బలోపేతం చేసేలా ఆయన చేపట్టిన చర్యలను పరిపూర్ణంగా ప్రతిఫలింప చేయాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి మీద ఉందని పేర్కొన్నారు. ఆర్థికవేత్తగా చురుకైన రాజకీయ నాయకుడిగా, ప్రసిద్ధ న్యాయవాదిగా , గొప్ప జాతీయ చట్టసభ సభ్యుడిగా అద్భుతమైన పండితుడిగా విజ్ఞాన ఖని ఆయన ఆచార్యుడిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మన దేశం నిర్మాణానికి అసాధారణ కృషి చేశారని తెలిపారు. పంచాయతీ సెక్రటరీ ఆమని ఉప సర్పంచ్ సుక్కల శంకర్ వార్డు సభ్యులు బబ్బూరి సభిత, పబ్బాల ఉమ బబ్బూరి భరత్ గౌడ్, కోట సుధాకర్ కోట సుధావాణి కోట దీప, నాయకులు రాసాల నర్సింహ యాదవ్, జక్కుల చంద్రయ్య యాదవ్, గుండు రవి, మాజీ సర్పంచ్ కోట పెద్ద స్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు కోట చంద్రశేఖర్ కోట చిన్న స్వామి కోట ఉపేందర్, కోట అంజనేయులు, కోట సుధాకర్, కోట స్వామి దాసు కోట పోషయ్య, కోట ముత్యాలు, కోట రాజయ్య, కోట యాదగిరి, కోట భాను, కోట సాయి, కోట వెంకటేష్ కోట చందు, నోముల నర్సింహ తదితరులున్నారు.

## శిశు పోషణ మరియు గర్భిని బాలింతల పోషణ పక్వాడ కార్యక్రమం




జగిత్యాల/ బుగ్గారం: 14 ఏ ప్రిల్ (తెలంగాణ వాణి విలేకరి ) జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం శకల్ల గ్రామంలో శిశుపోషణ బాలింతల గర్భిణి మహిళల పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా గర్భిణి మరియు బాలింతల కు తీసుకోవలసిన పోషకాహారాల గురించి వివరిస్తూ వ్యాధి నిరోధక టీకాలు తీసుకోవాలంటూ తల్లిపాల యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజేయడమైనది. వీరికి జంక్ ఫుడ్ మరియు ఫాస్ట్ ఫుడ్ తీసుకోవడం వలన ప్లాస్టిక్ వాడటం వలన కూడా జరిగే అనారోగ్య కరమైన విషయాల గురించి అవగాహన సదస్సు తెలియపార్చారు. రక్తహీనత కు గురవుతూ ఎనిమియా అధికంగా ఉండి వారు సమతుల్యమైన ఆహారం తీసుకుంటే వారికి భవిష్యత్తులో ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేకుంట ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు బాలింతలు కిషోర పిల్లలు మరియు ఆశా వర్కర్స్, అంగన్వాడి సిబ్బంది గ్రామ సర్పంచ్ పర్స రమేష్ గ్రామ సెక్రటరీ రజిత తదితరులు పాల్గొన్నారు.

## మండలవ్యాప్తంగా ఘనంగా డా,,బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు



రాయికోడ్ :ఏప్రిల్ 14(తెలంగాణ వాణి ప్రతినిధి) సంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన రాయికోడ్ తో పాటు అన్ని గ్రామాలలో, ప్రభుత్వ కార్యాలయాలలో మంగళవారం డా,,బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ముందుగా పురవీధులగుండా ర్యాలీ నిర్వహించి ఆ మహానీయుడి చిత్రపటానికి, విగ్రహానికి పూజాకార్యక్రమాలు చేసి పూలమాలలు వేసి నివాళు లర్పించి అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ 14 ఏప్రిల్ 1891వ సంవత్సరంలో జన్మించిన డాక్టర్ భీంరావ్ అంబేద్కర్ భారతీయ న్యాయవాది,ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత ఇతను అంటరానితనం,కుల నిర్మూలనా కోసం ఎంతో కృషి చేశాడని, రాజ్యాంగ ముసాయిదా రూపకల్పనలో, అణగారిన వర్గాల సామాజిక ఆర్థిక సాధికారతకు దానిని శక్తివంతంగా తీర్చిదిద్దంలో డా,,బిఆర్ అంబేద్కర్ చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు కావున అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,నాయకులు,అధికారులు మరియు పిల్లలు,పెద్దలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి




జగిత్యాల (తెలంగాణ వాణి) జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ చౌరస్తా, గాంధీనగర్ లో జరిగిన అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, సర్పంచ్ సతీశ్, కౌన్సిలర్స్ రాజశేఖర్, ప్రదీప్, మాజీ కౌన్సిలర్స్ పుప్పాల అశోక్, నక్క జీవన్, బొల్లి శేఖర్, రాధ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్ లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



జగిత్యాల: ఏప్రిల్ 14 (తెలంగాణ వాణి ప్రతినిధి) సమాజంలో అన్ని వర్గాలకు సమాన హక్కులు, స్వేచ్ఛ, గౌరవం కల్పించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని జిల్లా ఎస్పి అశోక్ కుమార్ వెల్లడించారు. భారతరత్న డా.బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక వివక్షను జయించి, అత్యున్నత విద్యను సాధించిన గొప్ప మేధావిగా, భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా ఉండడానికి కీలక పాత్ర పోషించిన వ్యక్తి భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని అన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం కల్పిస్తూ భారత దేశ అభివృద్ధికి, అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తిగా అభివర్ణించారు. భారతీయ సమాజంలో కూడా దళితులు, పేదలు, మహిళలకు సమాజంలో సమాన గౌరవం కల్పించే దిశగా రాజ్యాంగ కల్పన చేసిన వ్యక్తి గా అభివర్ణించారు. భారత రాజ్యాంగ నిర్మాతగా మాత్రమే కాకుండా, సామాజిక సమానత్వం, స్వాతంత్ర్యం, విద్య, శ్రామిక హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని ఆయన భావాలు సమాజ అభివృద్ధికి దిక్సూచిగా నిలుస్తాయిని ప్రతి ఒక్కరూ అంబేద్కర్ గారి ఆశయాలను అనుసరిస్తూ సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి అని పేర్కొన్నారు.డిఎస్పి వెంకటరమణ,ఎస్ బి ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్, సైదులు, ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేములవాడలో ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

**పాల్గొన్న ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్,మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**





వేములవాడ,ఏప్రిల్ 14 (తెలంగాణ వాణి ప్రతినిధి) :రాజ్యాంగ నిర్మాత,భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను వేములవాడ పట్టణంలో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజుతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ?ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశానికి అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ బాబా సాహెబ్ చూపిన మార్గంలో పయనించడం ద్వారానే సామాజిక సమానత్వం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు,వేములవాడ పట్టణ కౌన్సిలర్లు, అంబేద్కర్ సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు, పట్టణ ప్రజలు మరియు వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని జై భీమ్ నినాదాలతో నివాళులు అర్పించారు.

## వేములవాడలో ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు





వేములవాడ,ఏప్రిల్ 14 (తెలంగాణ వాణి ప్రతినిధి) :వేములవాడ పట్టణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఉదయం నుంచే పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సందడి నెలకొంది. వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై మహానీయుడికి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వేములవాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు,సీనియర్ న్యాయవాది గొంటి శంకర్, తెలంగాణ వాణి దినపత్రిక వేములవాడ నియోజకవర్గ ప్రతినిధి గొంటి గణేష్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా గొంటి శంకర్ మాట్లాడుతూ,భారతదేశానికి ప్రపంచంలోనే అతి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ అనే విలువలను ప్రజల జీవితాల్లో నాటిన గొప్ప దార్శనికుడు అని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని,ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు.అలాగే గొంటి గణేష్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఒక గొప్ప మేధావి మాత్రమే కాకుండా సమాజ మార్పు కోసం జీవితాంతం పోరాడిన యోధుడని అన్నారు. రాజ్యాంగం ద్వారా ఆయన కల్పించిన హక్కుల వల్లే నేడు ప్రతి వర్గానికి సమాన అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. యువత అంబేద్కర్ ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమం సందర్భంగా అంబేద్కర్ జయంతి వేడుకలకు హాజరైన ప్రజలకు అరటిపండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

## అంబేద్కర్ జయంతి సందర్భంగా రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ




ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి ప్రతినిధి) అంబేద్కర్ జయంతి సందర్భంగా "అరైవ్ అలైవ్ " కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద మంగళవారం రోడ్డు భద్రతపై అవగాహన మరియు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలకు ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యత, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు, హెల్మెట్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు, ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ సురక్షితంగా ప్రయాణిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ హాజరై రోడ్డు భద్రతపై ప్రసంగించారు. కార్యక్రమంలో సీఐ డి. రాజారెడ్డి, ఎస్సై బి. మహేష్, ఎస్సై-2 బాలసుబ్రహ్మణ్య చారి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 14 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) : దేశానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన సేవలు అనన్య సామాన్యమని రాజన్న సిరిసిల్ల ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచం మెచ్చిన గొప్ప న్యాయవాది అని, మానవతావాది అని, లండన్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయం ఆయనకు 'మాస్టర్ ఆఫ్ ఆల్ సైన్సెస్' ప్రదానం చేసిందని, అన్ని అంశాలపై పట్టున్న గొప్ప సామాజిక సంస్కర్త అని అన్నారు.?ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగాన్ని దేశానికి అందించి, భవిష్యత్తులో దేశం ఎదుర్కొనే అనేక సవాళ్లకు అంబేద్కరే పరిష్కార మార్గాలు చూపారని పేర్కొన్నారు.బాబాసాహెబ్ కలలుగన్న విధంగా భారత్ సూపర్ పవర్‌గా ఎదగాలంటే ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను చదువు వైపు ప్రోత్సహించాలని,నేటి యువత అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.మరోవైపు అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.వాహనదారులు, ప్రజలతో కలిసి ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతపై ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, సురక్షిత ప్రయాణాన్ని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య,సీ.ఐ నటేష్, ఆర్.ఐ లు మధుకర్, రమేష్, ఎస్.ఐ కిరణ్ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



జగిత్యాల (తెలంగాణ వాణి) జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి గజమాల వేసి అనంతరం ఏర్పాటు చేసిన వేదిక వద్ద గల అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన గావించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ దేశానికి అందించిన రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదని పేర్కొన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే మూల విలువలను రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు అందించారని తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆలోచనలను ఆచరణలో పెట్టాలని సూచించారు. యువత విద్యను సాధనంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. సామాజిక న్యాయం సాధించడంలో ప్రతి పౌరుడి పాత్ర కీలకమని తెలిపారు. రాజ్యాంగం ద్వారానే ఏర్పడిన ప్రభుత్వాలు అభివృద్ధి మరియుసంక్షేమ పథకాలు అందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. ప్రజలందరూ కలిసిమెలిసి ఉండి రాజ్యాంగ విలువలకు కట్టుబడి రాజ్యాంగం అందించిన అవకాశాలను ఉపయోగించుకొని వ్యక్తిగతంగా ఎదిగి జగిత్యాల జిల్లాను అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ భారత రాజ్యాంగ రూపకర్తగా, సామాజిక న్యాయం కోసం పోరాడిన మహానుభావుడిగా చిరస్థాయిగా నిలిచారని అన్నారు. ఆయన చూపించిన మార్గం సమానత్వం, విద్య, స్వాభిమానం అనే విలువలపై ఆధారపడి ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.అంతేకాకుండా, విద్య ద్వారా మాత్రమే సామాజిక, ఆర్థిక పురోగతి సాధ్యమని, యువత అంబేద్కర్ బాటలో నడిచి ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు.ఆర్థిక అసమానతలను తొలగించాలంటే విద్య ద్వారానే సాధ్యమని మనందరం మన పిల్లలతో పాటు చదువుకోలేని వారికి చదువు విలువ తెలిపి చదివుకునేలా చేయాలని తెలిపారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే మహిళా రిజర్వేషన్లు, వెనుకబడిన వారికి రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని అన్నారు. ప్రపంచ స్థాయిలోనే అంబేద్కర్ గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అంబేద్కర్ స్మృతి వరం అంబేద్కర్ స్టడీ సర్కిల్, అంబేద్కర్ స్మృతి వనం, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబెడ్కర్ రూపొందించిన రాజ్యాంగ ఆర్టికల్స్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రతి ఆర్టికల్ దేశ ప్రజల హక్కులు, బాధ్యతలు, సామాజిక న్యాయం సమానత్వాన్ని పరిరక్షించేందుకు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ముఖ్యంగా మౌలిక హక్కులు, దిశానిర్దేశక సూత్రాలు పరిపాలనా వ్యవస్థకు సంబంధించిన ఆర్టికల్స్ గురించి సవివరంగా తెలుసుకోవాలని అన్నారు. అలాగే, డాక్టర్ అంబేద్కర్ దూరదృష్టి వల్లే భారతదేశం ఒక ప్రజాస్వామ్య, సమానత్వం ఆధారిత దేశంగా ఎదిగిందని కొనియాడారు. అనంతరం ఆయన చూపిన మార్గంలో నడవాలని, రాజ్యాంగ విలువలను ఆచరణలో పెట్టాలని అందరిని కోరారు.అంతకుముందు అంబేద్కర్ జీవిత చరిత్ర మహనీయుల గొప్పతనం గురించి వివిధ కుల సంఘాల ప్రతినిధులు ఉపన్యసించారు. అంతకుముందు 'కళాజాత' కళాకారుల బృందం చే అంబేద్కర్ మహనీయుని గొప్పతనం గురించి పాటలు పాడి అందరిని అలరించారు.అనంతరం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లు బి. ఎస్. లత, బి. రాజ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రాజ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కిషోర్, డి ఎఫ్ ఓ సురేశ్, డీపీ ఆర్ఓ నరేశ్, జిల్లా స్థాయి అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, కౌన్సిలర్లు,స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్య ద్వారనే అన్ని సాధించ వచ్చు



ధర్మారం :ఏప్రిల్ 14 (తెలంగాణ వాణి ) విద్యతోనే అన్ని సాధించవచ్చని తద్వారా అంబేద్కర్ కలలుగన్న స్వరాజ్యాన్ని సాధించుకోవచ్చని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతోత్సవ కార్యక్రమంలో పలువురు వక్తలు సూచించారు. జయంతోత్సవ కమిటీ చైర్మన్ బొమ్మగాని సతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా తహసీల్దార్ డి శ్రీనివాస్, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి కన్నం అంజయ్య,ఎం బలరాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు దాగేటి ఉదయ్ యాదవ్, కొత్త నరసింహులు,ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఈ రాజకుమార్, లేబర్ ఆఫీసర్ నాజర్ హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పలువురు వ్యక్తులు మాట్లాడుతూ అంటరానితనం ఆర్థిక సమానత్వం సంఘంలో గౌరవం పొందాలంటే విద్య ద్వారానే అన్ని సాధించవచ్చునని కోరారు, డిగ్రీ కళాశాల తో పాటు ఐటీ కళాశాల ఏర్పాటుకు మంత్రి కృషి చేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. ధర్మారం గ్రామాన్ని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా ప్రకటించాలని తహశీల్దార్ విన్నవించారు. ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకొని పేద వర్గాలకు పంపిణీ చేస్తే నిరుపేదలు వెలుగులోకి వస్తారని అర్హులైన విలేకరులకు ఇంటి స్థలాలు కేటాయించాలని నాయకుడు కోరారు. ఈ కార్యక్రమంలో ఈవేళ జాతీయ అంబేద్కర్ అవార్డు పొందిన సుంచు మల్లేషమును అధికారులు నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ధర్మారం గ్రామపంచాయతీలో స్థానిక సర్పంచి దాగేటి రాజేశ్వరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కాదే సూర్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ ఎం తిరుపతి, నాయకులు దేవి జనార్ధన్, ఉప సర్పంచ్ మల్లేశం, టి సతీష్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# దళితుల అభ్యున్నతి కృషి చేసిన అక్షర సూరీడు అంబెడ్కర్



మందమర్రి టౌన్ ఏప్రిల్ 14 (తెలంగాణ వాణి విలేకరి ) దళితుల అభ్యున్నతికి కృషి చేసిన అక్షర సూరీడు భారతరత్న రాజ్యాంగ నిర్మాత బి ఆర్ అంబెడ్కర్ అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి పేర్కొన్నారు. అంబెడ్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని సోమవారం అంబెడ్కర్ యువజన సంఘం పట్టణ కన్వీనర్ మొయ్య రాంబాబు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి పాల్గొని అంబెడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ అంటరాని కుల నిర్మూళన కోసం విశేష కృషి చేసిన అంబెడ్కర్ సమాజానికి స్ఫూర్తి దాయకుడని అని కో నియాడారు. అంబెడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒకరు కృషి చేయాలని కోరారు. ఈ సందర్బంగా పలు కార్మిక, రాజకీయ, కుల సంఘాల నేతలు పాల్గొని అంబెడ్కర్ వి గ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా అంబెడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యం లో మార్కెట్ వీధుల గుండా భారీ ధ్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమం లో మంచిర్యాల డి సి పి భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు,అంబెడ్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు. అనంతరం అన్నధాన కార్యక్రమం చెపట్టారు. ఈ సందర్బంగా బి ఆర్ ఎస్ నాయకురాలు రేఖ అధ్వవర్యం లో మజ్జిగ పంపిణి చేపట్టారు.

# ప్రయాణాల్లో నిర్లక్ష్యంతో.. ప్రాణాలకు ముప్పు ఎస్సై రమాదేవి

## అంబేద్కర్ వేడుకల్లో రహదారి ప్రతిజ్ఞ చేయించిన ఎస్సై




సుజాతనగర్ (తెలంగాణ వాణి) "అరైవ్ అలైవ్ (రోడ్డు భద్రత)" కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంబేద్కర్ నగర్ లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ జయంతి వేడుకల కార్యక్రమంలో పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణాల్లో నిర్లక్ష్యంతోనే ప్రాణాలకు ముప్పు వస్తుందని, విధిగా హెల్మెట్ , సీట్ బెల్టు ధరించి తమ కుటుంబాలకు భరోసాగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణ కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, కార్లలో సీట్‌బెల్ట్ పెట్టుకోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని స్పష్టం చేశారు. అధిక వేగంతో వాహనాలు నడపకుండా జాగ్రత్తగా ప్రయాణించాలన్నారు. ప్రతి కుటుంబానికి ఆదారమైన వ్యక్తి ప్రమాదంలో పడితే ఆ కుటుంబం ఆర్థికంగా, భావోద్వేగంగా తీవ్రంగా నష్టపోతుందన్నారు. ఒక చిన్న నిర్లక్ష్యం వల్ల అమూల్యమైన ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే అలవాట్లను మానుకోవాలని సూచించారు. ఇటువంటి చర్యలు తమకే కాకుండా ఎదుటివారికి కూడా ప్రమాదకరమని తెలిపారు. ప్రత్యేకంగా స్కూల్ బస్సు డ్రైవర్లు మరింత జాగ్రత్తగా ఉండాలని, పిల్లల ప్రాణాలు అత్యంత విలువైనవని గుర్తుచేశారు. భవిష్యత్తు తరానికి మేలు చేసే పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. అనంతరం రోడ్డు భద్రత అవగాహనకు సంబందించిన ప్రతిజ్ఞ చేయించారు.

# రోడ్డు భద్రత మన అందరి బాధ్యత

## - హుస్నాబాద్ ఏసీపీ సదానందం



హుస్నాబాద్,ఏప్రిల్ 14 తెలంగాణ వాణి ప్రతినిది రహదారి నిబంధనలు పాటించడం ద్వారానే విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని హుస్నాబాద్ ఏసీపీ సదానందం పేర్కొన్నారు.పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం నిర్వహించిన 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను స్వచ్ఛందంగా పాటించాలని పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవడం వల్ల ప్రమాద సమయాల్లో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని సూచించారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం ఆత్మహత్యతో సమానమని ఆయన హెచ్చరించారు.అనంతరం వాహనదారులు, స్థానిక ప్రజలతో కలిసి రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

పోలీసుల చొరవ: మిర్జాపూర్ క్రాస్ రోడ్డు వద్ద గుంతల పూడ్చివేత

కేవలం అవగాహన సదస్సులకే పరిమితం కాకుండా, ప్రయాణీకుల ఇబ్బందులను గమనించిన పోలీస్ శాఖ ఆచరణలోనూ ముందుంటోంది. నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన మిర్జాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఎత్తుపల్లాలు, గుంతలను పోలీసులే దగ్గరుండి గ్రావెల్‌తో చదును చేయించారు. పోలీసుల ఈ చొరవ పట్ల వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీను, ఎస్సై లక్ష్మారెడ్డి మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలు కొనసాగిద్దాం

## అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డా" సతీష్ యాదవ్



తెలంగాణ వాణి , ఏప్రిల్ 14, వనపర్తి ప్రతినిధి : విశ్వ నాయకుడు, రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలు కొనసాగిద్దాం. ఆయన రాసిన రాజ్యాంగంలోని ఫలాలను అనుభవిస్తున్న మనము జన్మజన్మలకు రుణపడి ఉండాలి. విద్యా వంతులైన రాష్ట్ర, జిల్లా.. అధికారులు కూడా ఆయనను ఒకే కులానికి అన్వయించడం మన ఐక్యతను దెబ్బతీయటమే.ఇది వారి అవివేకాని నిదర్శనం అని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు డా" సతీష్ యాదవ్ తెలిపారు. మంగళవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా వనపర్తి పట్టణం అంబేద్కర్ చౌక్ లో ఆయన విగ్రహం దగ్గర మొదటి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన అఖిలపక్ష ఐక్యవేదిక తో పాటు ప్రజా సంఘాల నాయకులు కూడా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డా" సతీష్ యాదవ్ మాట్లాడుతూ మహనీయులలో గొప్పవాడు బడుగు బలహీన వర్గాలకు ఆదర్శం, ప్రపంచంలో ఏ దేశానికి లేని రాజ్యాంగం మనకు అందించిన బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రపంచంలో అందరికీ ఆదర్శమని ఆయన ఒక కులానికి గాని ఒక ప్రాంతానికి గాని ఒక మతానికి గాని సంబంధం లేదని అందరివాడు కనుక ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శవంతంగా తీసుకోవాలని, దానికి విరుద్ధంగా కలెక్టరేట్లో ఒక కులానికి సంబంధించి వేడుకలు జరపడాన్ని అఖిలపక్ష ఐక్యవేదిక ఖండిస్తుందని ఈ సందర్భంగా సతీష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్ తో పాటు, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, ప్రజా సంఘ నాయకులు, అధ్యాపకులు,మద్దిలేటి, చంద్రశేఖర్, చిన్న రాములు, బండారు శ్రీనివాసులు, శాంతన్న, గంధం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇస్రోకు ఎంపికైన ఎస్ పి ఆర్ పాఠశాల విద్యార్థి



హసన్ పర్తి ఏప్రిల్ 14 (తెలంగాణ వాణి ప్రతినిధి) హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం, ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఎన్.సి.సి. స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థి "ఇస్రో యువికా--2026" కు ఎంపిక కావడం విశేషం."ఇస్రో యువికా--2026" ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానం పై శిక్షణ అందించడం దీని యొక్కముఖ్య ఉద్దేశ్యం.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుంచి 14 మంది విద్యార్థులు ఎంపిక కాగా, ఎన్.సి.సి. స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎల్లాపూర్) పాఠశాల విద్యార్థి డి. నవీన్ (9వ తరగతి) ఎంపిక కావడం సంతోషకరం.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మాట్లాడుతూ "ఇస్రో యువికా--2026" కు విద్యార్థులు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులను అర్హులుగా ఎంపిక చేయడం ద్వారా వారికి ప్రాక్టికల్ జ్ఞానం, సైన్స్ ప్రాజెక్టులు,వివిధ ప్రయోగాలు ద్వారాశిక్షణఅందించబడుతుందని,దేశ వ్యాప్తంగా 15 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించి విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానం పై మరింతఅవగాహన కల్పించబడుతుందని ,యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే ఈ "ఇస్రో యువికా--2026" కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని, ఇందులో మా పాఠశాల విద్యార్థి ఎంపిక కావడం మా పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. అంతేకాకుండా మా పాఠశాల విద్యార్థులు ఉన్నత శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి సేవ చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.పాఠశాలప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యలోనే కాకుండా విజ్ఞానంలో కూడా ముందుండేలా కృషి చేస్తున్నామని, తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థులు అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. అనంతరం "ఇస్రో యువికా-2026" కు ఎంపికైన విద్యార్థి డి. నవీన్ ను పాఠశాల డైరెక్టర్ జగన్మోహన్ ప్రధానోపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ వాణి

బుధవారం, ఏప్రిల్ 15, 2026

## జాగృతి విద్యార్థులను సన్మానించిన మాజీ మంత్రి

### జాగృతి కళాశాల విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు




తెలంగాణ వాణి, ఏప్రిల్ 14, వనపర్తి ప్రతినిధి : రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు, ఉమ్మడి జిల్లా 1వ ర్యాంకును సాధించిన జాగృతి విద్యార్థులను ఘనంగా సన్మానించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి.ఐపిఈ 2026 ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో పట్టణంలోని జాగృతి కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో × బైపిసి లో ఉజ్మా హజారా 438/440 మార్కులతో 2వ ర్యాంకును, అదే విధంగా ×× బైపిసి లో హెచ్.అనుష్క 994/1000 మార్కులతో ఉమ్మడి జిల్లా మొదటీ ర్యాంకును సాధించి మరొకసారి వనపర్తిలో ప్రతిభ చాటారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి జాగృతి కళాశాలకు వచ్చి స్టేట్ ర్యాంకర్లను ఘనంగా సన్మానించారు. ఈ సంధర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో కార్పొరేట్ స్థాయి మార్కులతో , స్టేట్ ర్యాంకులను, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఫస్ట్ ర్యాంకులను సాధిస్తూ ఉమ్మడి జిల్లాలో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నందుకు జాగృతి కళాశాల విద్యార్థులను అభినందించారు.
అదే విధంగా జేఈఈ మెయిన్-2026 సెక్షన్-× ఫలితాలలో సిహెచ్.అర్జున్ 91.69 పర్సంటైల్ తో జిల్లాలో అగ్రగామిగా నిలవడం జరిగింది అని కొనియాడారు జిల్లాలో ఇంటర్ విద్యలోఐపిఈ మార్కులతో పాటు జేఈఈ, నీట్, ఎంసెట్ లలో కూడా కార్పొరేట్ కళాశాలలకు దీటుగా జాగృతి కళాశాల నిలవడం ఎంతో సంతోషంగా ఉంది అని జాగృతి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంబటి వినోద్ కుమార్ ని యజమాన్య సభ్యులు భాస్కర్ , శ్యామ్ కుమార్ , సత్యనారాయణ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్ , వాకిటి శ్రీధర్ , ప్రేమ్ నాథ్ రెడ్డి , భాగ్యరాజు , హేమంత్ తదితర నాయకులు, యజమాన్య సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన ప్రయాణ ప్రాంగణం ప్రారంభించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

### అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే

### రామాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్ర

నాగిరెడ్డిపేట మండలం (తెలంగాణ వాణి) అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు రామాలయం ప్రాంతం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్రగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు . అనంతరం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో బిల్డింగ్ అభివృద్ధి కోసం పునః ప్రారంభం కోసం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు . అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు . అక్కడ నుండి నూతనంగా ఏర్పాటుచేసిన ప్రయాణ ప్రాంగణంను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు . మండల కేంద్రంలో పోచమ్మ ఆలయం ప్రాంతంలో నూతనంగా సాంక్షన్ అయిన సిసి రోడ్ పనులను ప్రారంభించారు . చెప్తే జాన్కంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు . ఎస్ హెచ్ జి బిల్డింగ్ మరియు సిసి రోడ్ పనులను పర్యవేక్షించారు . అనంతరం ప్రయాణ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ. చిన్నప్పటి నుండే చాలా బాధలు నోచుకోని ఇంతటి గొప్ప వ్యక్తిగా ఎదగడం చూసి మనలో మార్పు తెచ్చుకోవాలని కోరారు . నేడు బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం లేకపోతే ఇట్టి కార్యక్రమాలు సవ్యంగా జరిగేవి కావాని గుర్తు చేశారు. ఈ ర్యాలీలో ఒకప్పుడు ఎన్టీఆర్ హయాంలో పాల్గొన్నట్టు ఇంతమంది మన ర్యాలీలోని పాల్గొన్నారని సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాంచందర్ రెడ్డి చెప్పారన్నారు . ఈరోజు కార్యకర్తలు ఈ మొండి వైఖరితోని నేను ఎమ్మెల్యేగా ఉన్నానని గుర్తు చేశారు . కార్యకర్తల పట్టుదల శ్రమ ఎన్నటికీ మర్చిపోను అని గుర్తు చేశారు . కాంగ్రెస్ కార్యకర్తల జోష్ చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు . కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నీటికి 2సం,, 7 నెలలు పూర్తయ్యే నాటికి గ్రామాలలో చాలా అభివృద్ధి జరిగిందన్నారు . ఈరోజు ప్రారంభించబోయే ప్రయాణ ప్రాంగణం పూర్తి వెనకాల చాలా కృషి ఉందని తెలిపారు . ఎల్లారెడ్డి బస్టాండ్ చూసి తెలంగాణనే అబ్బురు పరిచేలా తీర్చిదిద్దామన్నారు . అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడడానికి సమయం ఇస్తే నా నియోజకవర్గంలోని సమస్యలను లేవనెత్తి పరిష్కారానికి బాటలు వేస్తున్నానన్నారు . ఈరోజుటితో ఎల్లారెడ్డి గోపాల్పేట్ బస్టాండ్లు పూర్తికాగా తాడ్వాయి, సదాశివ్ నగర్ బస్టాండ్ ల పునః నిర్మాణం ఉందని తెలిపారు . గోపాల్పేట్ బస్టాండును క్రీస్తు శేషులు కిషన్ రెడ్డి గారి కృషితో ఏర్పాటు చేయడం జరిగింది . నాటి నుండి నేటి వరకు ఎలాంటి అభివృద్ధి జరగలేదు . ఇకపై నేను కూడా పట్టించుకోకుంటే ఇది ఇలాగే ఉంటుందని శ్రద్ధతో ఈ నిర్మాణానికి నోచుకున్నాను అన్నారు. ప్రయాణ ప్రాంగణంలో మరుగుదొడ్ల సమస్య ఉంది కాబట్టి వాటి నిర్మాణానికి ఎంత ఖర్చయినా నా నిధుల నుండి ఇస్తానని తెలిపారు . బస్టాండ్లో లైటింగ్ , సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని డిఎం రవికుమార్ కు కోరారు . ఈ నిర్మాణానికి ఎస్ టి ఎఫ్ కింద 40 లక్షల రుణాలను మంజూరు చేసామని తెలిపారు . ఇంతే కాకుండా లింగంపేట మండలం మోత గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం 200 కోట్లతో మంజూరు చేసి శంకుస్థాపన చేసామని తెలిపారు . అలాగే మహిళా సంఘాలు సంఘాన్ని ఏర్పాటు చేయడం కోసం స్త్రీ శక్తి భవనాలను ఏర్పాటు చేశామన్నారు . వెంకంపల్లి సర్పంచ్ భాస్కర్ రెడ్డి చెప్పిన సమస్యను దృష్టిలో ఉంచుకొని పూర్తిచేసేలా కృషి చేస్తానన్నారు. పేద పిల్లల రవాణా కోసం నాలుగు ఐదు బస్సులను మంజూరు చేసేలా డీఎంకే కోరారు . నేను నియోజకవర్గ ఎమ్మెల్యే అయ్యాక ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద మొదటగా 10 కోట్లు రెండో విడతలు 20 కోట్లు , మొన్నటి బడ్జెట్లో 50 కోట్లు నిధులను తీసుకువచ్చానని తెలిపారు . బస్టాండ్లను పరిశుభ్ర పరిచయం సర్పంచ్, ఉప సర్పంచ్ చొరవ చూపులను కోరారు. నేటి కాలంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను దృష్టిలో పెట్టుకొని నా సొంత నిధులతో ఎల్లారెడ్డి బస్టాండ్ లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు అలాగే డీఎస్పీ ఆదేశాలతో ప్రతిరోజు బస్టాండ్ ప్రాంతంలో రాత్రిపూట కానిస్టేబుల్ ఏర్పాటు చేసేలా కృషి చేశానన్నారు. ప్రతి బస్టాండ్ ఒక ఎయిర్పోర్ట్ లాగా తయారు చేసేలా కృషి చేయాలన్నారు. లింగంపేట మండలం ప్రాంతంలో 1.20 కోట్ల వ్యయంతో కూడిన నాలుగు గోదాములను సాంక్షన్ చేయడం జరిగిందన్నారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో సీడ్స్ ప్రాంతంలో రెండు మెట్రిక్ టన్నులతో కూడిన దానిని 16 కోట్ల వ్యయంతో టెండర్ వేయడం జరిగింది, తొందరలో ప్రారంభిస్తామని తెలిపారు .
ఇట్టి కార్యక్రమంలో ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ , సీనియర్ నాయకులు రామచందర్ రెడ్డి , నాగిరెడ్డిపేట మండల అధ్యక్షులు శ్రీధర్ గౌడ్ , వివిధ గ్రామాల సర్పంచులు , కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు .

## అంబేద్కర్ కు నివాళులర్పించిన ఎంపీ వంశీకృష్ణ



ధర్మారం :ఏప్రిల్ 14 (తెలంగాణ వాణి) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. అనంతరం అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత సుంచు మల్లేషన్లో శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాడే సూర్యనారాయణ, దాగేటి ఉదయ్ యాదవ్, జయంతోత్సవ కమిటీ చైర్మన్ బొమ్మగాని సతీష్ కుమార్, పలు గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్ కి ఘన సన్మానం



బూర్గంపహాడ్ (తెలంగాణ వాణి ప్రతినిధి) బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ తెలంగాణ ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో బ్రిలియంట్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మార్కులు సాధించి సంచలనం సృష్టించిన బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బిఎన్ఆర్ ని గ్రామ సర్పంచ్ శివరాం కిషోర్ నాయక్, ఉప సర్పంచ్ రమేష్ ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా సారపాక లోనే వివిధ కళాశాలలకు చెందిన 50 మంది విద్యార్థులను గ్రామ సర్పంచ్ శివరాం కిషోర్ నాయక్ సన్మానించడం జరిగింది, అందులో 20 మంది విద్యార్థులు బ్రిలియంట్ వారే ఉండడం గమనార్హం. ప్రత్యేకంగా స్టేట్ ఫోర్త్ ర్యాంక్ 466/470 ఆర్.పావని, స్టేట్ ఫిఫ్త్ ర్యాంక్ కె.బన్యశ్రీ 465/470, స్టేట్ సిక్స్త్ ర్యాంక్ టి.భవ్యశ్రీ 464/470 లను సన్మానించారు, ఈ కార్యక్రమంలో మండల ప్రముఖులు ఎంపీడీవో జమలారెడ్డి, ఎంఈఓ యదుసింహారాజు, సబ్ ఇన్స్పెక్టర్ మెడ ప్రసాద్, సర్పంచ్ శివరాం కిషోర్ నాయక్, ఉపసర్పంచ్ రమేష్, ఈవో మహేష్, పాలకమండలి సభ్యులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, ప్రజలు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్ కు పలువురి ఘన నివాళి



ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి ప్రతినిధి) నిజామాబాద్ జిల్లా భీమ్ ఆర్మీ అధ్యక్షులు గడ్డం రవి, భీమ్ ఆర్మీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఎన్ రమేష్ రావణ్ లు మరియు స్థానిక పట్టణ మూడో టౌన్ ఎస్సై హరిబాబు, అశోక్ భాగ్యవన్ తదితరులు ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది.

## ఏద మినిస్ట్రీస్ మరియు ఏద వర్షిప్ సెంటర్ '11వ' వార్షికోత్సవం



ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి ప్రతినిధి) ఏద మినిస్ట్రీస్ ఏద వర్షిప్ సెంటర్ యొక్క '11వ' వార్షికోత్సవ సందర్భంగా దైవ సేవకులైన బ్రదర్.శ్రీనివాసా చారి మరియు సిస్టర్.హెప్సిబా చారి గత '10' సంవత్సరాలుగా వేసవి కాలంలో కామారెడ్డి హైవే పక్కన ప్రయాణం చేసి వెళ్తున్న అనేకమంది దాహం తీర్చడానికి ఏద వర్షిప్ సెంటర్,ఎల్లారెడ్డి నందు ఏద మినిస్ట్రీస్ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఈ వేసవి కాలంలో ఎండ వేడిమికి తట్టుకోలేక అటువైపుగా వెళ్తున్న బస్సులు... కార్లు...బైక్ ల మీద వెళ్తున్న వారందరూ ఇక్కడ ఆగి చలివేంద్రంలోని చన్నీటిని తాగి... కొద్దిసేపు సేద తీర్చుకొని వెళ్తున్నారు. ఈ విధంగా గత '10' సంవత్సరాలుగా ఏద మినిస్ట్రీస్ చలివేంద్రం ద్వారా ఎంతోమంది దాహం తీరుస్తూ అనేకమందికి దీవెనకంగా ఆశీర్వాదకరంగా ఉంటుంది. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14న జరుపుకునే ఏద మినిస్ట్రీస్ ఏద వర్షిప్ సెంటర్ వార్షికోత్సవంలో భాగంగా ఈ 2026వ సంవత్సరము కూడా ఈరోజు (14-04-2026 ) మంగళవారం నాడు '11 వ' సంవత్సరం ఏద మినిస్ట్రీస్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని దైవ సేవకులైన బ్రదర్.శ్రీనివాసా చారి లిసిస్టర్.హెప్సిబా చారి గార్లలి ఆధ్వర్యంలో లిమున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ గారు, రిబ్బన్ కట్ చేసి ఈ చలివేంద్రమును ప్రారంభించారు మున్సిపల్ వైస్ చైర్మన్ భాగ్యవతి ప్రశాంత్ గౌడ్, కౌన్సిలర్ విద్యాసాగర్ , గఫార్ , రఫిక్గారు, తిరుపతి మరియు పప్పు వెంకటేశం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.. వచ్చిన అతిధులను బ్రదర్ శ్రీనివాసా చారి, హెప్సిబా చారి శాలువాలతో సన్మానించారు

## టిఎన్జీవో కేంద్ర సంఘం నాయకులకు ఘన సన్మానం



మంచిర్యాల (తెలంగాణ వాణి) టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడిగా రెండవసారి ఎన్నికైన మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ లను ను జిల్లా టీఎన్జీవో ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంగళవారం హైదరాబాద్ నాంపల్లి లోని టిఎన్జీవో భవన్ లో జిల్లా టిఎన్జీవో అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో వారిని శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ, టిఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడిగా మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ హుస్సేనీ ముజీబ్ లు ఎన్నిక కావడం సంతోషకరమని తెలిపారు. అనంతరం ఉద్యోగుల సమస్యలపై చర్చించగా, స్పందించిన జగదీశ్వర్ తొందరలోనే ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో సమావేశం ఏర్పాటు చేసి, ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారన్నారు. అనంతరం టీఎన్జీవో జిల్లా మాజీ కార్యదర్శి భూముల రామ్మోహన్ సేవలను గుర్తిస్తూ, ఆయన శాలువాతో ఘనంగా సన్మానించారు. తదనంతరం జిల్లా టిఎన్జీవో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు సంఘం కేంద్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కోఆప్షన్ పద్ధతిలో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టిఎన్జీవో జిల్లా కార్యదర్శిగా బొడ్డు శ్రావణ్ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మోసిన అహ్మద్, స్పోర్ట్స్ కార్యదర్శిగా కుమార్ లను ఎన్నుకొని, అనంతరం వారిని కేంద్ర సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల తోపాటు జిల్లా అధ్యక్షుడు, కేంద్ర సంఘం కార్యదర్శి, అసోసియేట్ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, టీఎన్జీవో జిల్లా మాజీ అధ్యక్షులు కందుకూరి సురేష్ బాబు, ఆదిలాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు సంద అశోక్, జిల్లా కోశాధికారి సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు రామ్ కుమార్, తిరుపతి, నరేందర్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, కార్యదర్శి అజయ్ ప్రశాంత్, బెల్లంపల్లి అధ్యక్షుడు వెంకటేష్, లక్షెట్టిపేట్ యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాస్, చెన్నూరు అధ్యక్షుడు వేణు, కన్నెపల్లి పద్మనాభం లు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కు మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్ ఘన నివాళి



ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి ప్రతినిధి) భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని (ఏప్రిల్ 14, 2026) పురస్కరించుకుని నేడు ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులు తెలిపిన ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జాజాల సురేందర్ . ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలందరికీ డాక్టర్. బి. ఆర్ అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ కలలు గన్న వివక్ష రహిత సమాజ నిర్మాణం కోసం మనందరం కలిసి కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో బారాస మండల పట్టణ అధ్యక్షులు జలంధర్ రెడ్డి,ఆదిమూలం సతీష్ కుమార్, ఎల్లారెడ్డి సొసైటీ మాజీ అధ్యక్షులు నర్సింలు, సర్పంచులు పటేల్ సాయిలు, గంగారెడ్డి, కామారెడ్డి జిల్లా రేషన్ డీలర్స్ అధ్యక్షులు నాగం సురేందర్, నాగం రాజయ్య, మల్లారెడ్డి, అనిల్ పాషా, శివానంద్, శ్రవణ్, ఇమ్రాన్, దయాకర్, కృష్ణారెడ్డి, బొగ్గుల సాయిలు, నారాయణ, రవి,లక్ష్మీనారాయణ, అంజా గౌడ్, బర్కత్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనతో దేశాభివృద్ధి సాధ్యం: జిల్లా కలెక్టర్



మంచిర్యాల (తెలంగాణ వాణి) రాజ్యాంగ నిర్మాత, సమానత్వ సమాజం కోసం కృషి చేసిన మహనీయుడు డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధన తో దేశాభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఐ.బి చౌరస్తాలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, వివిధ బి. సి. సంఘాల నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, ఇన్చార్జ్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, వివిధ బిసి సంఘాల నాయకులతో కలిసి హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, దళిత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డా. బి.ఆర్. అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు సదా స్మరణీయమని తెలిపారు. భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించడమే కాకుండా సమాజంలో సమానత్వం, మహిళల అభివృద్ధి, కుల, మత, వర్ణ, వర్గ ప్రాంత విభేదాలు లేకుండా దేశ పౌరులుగా అందరూ సమానమైన అని తెలుపుతూ రాజ్యాంగ రచన చేశారని, విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఆనాటి సమాజంలోని అసమానతలను ఎదుర్కొని ఉన్నత విద్యను అభ్యసించి, సమాన అవకాశాల కోసం రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. మన దేశ రాజ్యాంగం వివిధ దేశాల రాజ్యాంగాల ప్రేరణతో రూపొందించబడిందని, తద్వారా నేడు దేశ పరిపాలన సులభతరమైందని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో రాజ్యాంగం అందరికీ ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలు రాజ్యాంగం ప్రకారమే జరుగుతోందని, ప్రతి ఒక్కరికీ చదువుకునే హక్కు, స్వేచ్ఛగా జీవించే హక్కులు రాజ్యాంగం ద్వారా కల్పించబడిందని తెలిపారు.ఈ కార్యక్రమాలలో సంబంధిత శాఖల అధికారులు, బి.సి. సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



రామకృష్ణాపూర్ (తెలంగాణ వాణి) క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ గుడిసెల సంధ్యారాణి, వైస్ చైర్ పర్సన్ మిట్టపల్లి సరిత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఈ సందర్భంగా చైర్ పర్సన్ సంధ్యారాణి,వైస్ చైర్ పర్సన్ సరిత లు మాట్లాడుతూ.. డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం సోదర భావం సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన కృషిని స్మరించుకున్నారు.భారత రాజ్యాంగ నిర్మాత దేశ గమనాన్ని మార్చడంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పోషించిన పాత్ర ఎనలేనిదని ఆయన జీవితమే గొప్ప పాఠం అని చెప్పిన మాటలు తరతరాలకు ఆదర్శమని ఇవాళ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళులు అర్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఆధ్వర్యంలో ఘనంగా అంబెడ్కర్ జయంతి వేడుకలు



మందమర్రి టౌన్ (తెలంగాణ వాణి) భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135 వ జయంతిని పుర స్కరించుకొని సోమవారం సింగరేణి ఆధ్వర్యం లో స్థానిక గ్రీన్ పార్క్ లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించా రు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ మంత్రి జి. వివేక్ వెంకట స్వామి హాజరు కాగా ఈ సందర్భంగా మంత్రికి ఘనస్వాగతం పలికిన అనంతరం, ఆయన పతాకాన్ని ఆవిష్కరిం చారు. అనంతరం మంత్రి జి. వివేక్ వెంకటస్వామి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ అంబేద్క ర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీనియర్ హిందీ పండిట్ శజామి ప్రసాద్ రావు రాసిన పుస్త కం తో పాటు ఆయన రచించగా, డి.జి.ఎం ఐ ఇ కె. కిరణ్ కుమార్ సంగీతం అందించిన 'అంబేద్కర్ థీమ్ సాంగ్'ను ఆవిష్కరిం చారు.ఈ సందర్భంగా మంత్రి జి.వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ, సమాజంలో సమానత్వం కోసం అంబేద్కర్ చేసిన కృషిని కొనియాడారు. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని కొనియాడారు. కార్మి కుల సంక్షేమానికి ప్రభు త్వం కట్టుబడి ఉందని, కొత్త బొగ్గు గనుల ఏర్పా టు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరు గుపడతాయని తెలిపారు. సింగరేణిని మరింత లాభసాటిగా మార్చేందు కు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చు కోవాలని ఆయన పిలుపు నిచ్చారు.అనంతరం జి ఎం ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సింగరేణి అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర మరువ లేనిదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఏ.భాస్కర్ మాజీ ఎం ఎల్ ఏ నల్లాల ఓదెలు, ఎస్.ఓ టు జి.ఎం జి.ఎల్. ప్రసాద్ డి.జి.ఎం పర్సనల్ సి హెచ్.అశోక్ ఎస్. రమేష్ సి ఎం ఒ ఎ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలి

**క్రమశిక్షణతో కూడిన వాహన చోదనం సామాజిక బాధ్యత**

**రహదారి భద్రతా నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి**

**హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి సురక్షిత ప్రయాణాన్ని సాగించాలి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

**99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు భద్రత వారోత్సవాలు**



కొత్తగూడెం (తెలంగాణ వాణి) రోడ్డు నిబంధనలను తూచా తప్పకుండా పాటించడం ద్వారానే విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం కొత్తగూడెం పట్టణపరిధిలోని స్థానిక పోస్టాఫీసు సెంటర్‌లో రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన రహదారి భద్రత ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహన చోదకులు అతివేగాన్ని నియంత్రించుకోవాలని, ప్రయాణ సమయంలో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. రహదారి నిబంధనల పట్ల అవగాహన లేకపోవడం వల్లనే అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. ముఖ్యంగా యువత బైక్ రేసింగ్‌లకు దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ప్రభుత్వ యంత్రాంగం చేపడుతున్న ఈ ప్రగతి ప్రణాళికలో ప్రజలందరూ భాగస్వాములై రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఆయన ఆకాంక్షించారు. రహదారి భద్రత అనేది కేవలం వారోత్సవాలకే పరిమితం కాకుండా నిత్య జీవితంలో భాగంగా మారాలని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్ పి రోహిత్ రాజు, ఆర్డీవో మధు, మేయర్ మూడ్ గణేష్, వివిధ స్టేషన్ల సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి వేడుకలలో “భద్రతా ప్రతిజ్ఞ”.

**- ”అరైవ్ అలైవ్” లో రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ.**



ఆదిలాబాద్, ఏప్రిల్ : 14 ( తెలంగాణ వాణి ప్రతినిధి )డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తా నందు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ జయంతి వేడుకలలో ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించడం చేశారు. అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి పరణాళికలో భాగంగా లిఅరైవ్ అలైవ్‌లిలో భాగంగా వారం రోజులపాటు జరిగే కార్యక్రమాలలో మంగళవారం అంబేద్కర్ విగ్రహాల వద్ద రోడ్డు భద్రతా నియమాలపై భద్రతా ప్రతిజ్ఞను జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని జయంతి ఉత్సవాలలో సంబంధిత పోలీసు అధికారులు ప్రజలతో కలిసి పాల్గొని భద్రత ప్రతిజ్ఞ చేయడం జరిగింది.ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమనిబంధనలు పాటించి రోడ్డుపై ప్రమాదాలను నివారించే దిశగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరిస్తామని మరియు రాంగ్ సైడ్ ప్రయాణం, రాంగ్ రూటు ప్రయాణం రాష్ డ్రైవింగ్ లాంటివి చేయమని ప్రతిజ్ఞ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు.నేను భారతదేశ పౌరుడిగా, మోటారు వాహనముల చట్టంలో పొందుపరిచిన రోడ్డు నియమ నిబంధనలను పాటిస్తానని, ఇతరులకు తెలియజేస్తానని, తోటి రోడ్డు వినియోగదారులను గౌరవిస్తానని, రోడ్డు ప్రమాదములు జరుగకుండా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంతఃకరణశుద్ధితో నిర్వహిస్తానని, రోడ్డుపై ప్రయాణించినపుడు ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘన గాని, ప్రేరేపించడం గాని లేకుండా ప్రజలందరూ మన రోడ్లపై సురక్షితంగా ప్రయాణం చేయడానికి సహకరిస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను అని ప్రజలు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయడం జరిగింది.
జిల్లా వ్యాప్తంగా గల అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఈరోజు జరిగిన అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో పోలీసు సిబ్బంది ప్రజలచే భద్రతా ప్రతిజ్ఞను చేయించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ రవీంద్ర కుమార్, అదనపు కలెక్టర్, ప్రజా ప్రతినిధులు, అదిలాబాద్ డిఎస్పిఎల్ జీవన్ రెడ్డి, డిటిఓ శ్రీనివాస్, పట్టణ సీఐలు, ఎంవిఐలు, ఏఎంవిఐ లు,

# మోడీ మతోన్మాద ఫాసిజం దేశానికి ప్రమాదకరం

**ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాల**

**దిక్సూచి కామ్రేడ్ జార్జి రెడ్డి**

**కె.యు.లో కామ్రేడ్ జార్జి రెడ్డి 54వ**

**వర్ధంతిని స్మరిస్తూ “మార్నింగ్ వాక్ .**




హనుమకొండ (తెలంగాణ వాణి స్టాఫ్ రిపోర్టర్) భారతదేశంలో జరిగే లౌకిక, ప్రజాస్వామిక, ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాలకు దిక్సూచిగా కామ్రేడ్ జార్జి రెడ్డి నిలిచాడని, జార్జి స్ఫూర్తితో శాస్త్రీయ విద్య, సమానత్వ సమాజ స్థాపన కోసం నేటి విద్యార్థి, యువత సంఘటితంగా పోరాడాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టి.పి.టి.ఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీ లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) ప్రస్తుత, పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఇండియన్ ఐన్ స్టీన్, హైదరాబాద్ చేగువేరా, ఉస్మానియా అరుణతార, పి.డి.ఎస్.యు.వ్యవస్థాపకులు కామ్రేడ్ జార్జి రెడ్డి 54 వ వర్ధంతిని స్మరిస్తూ కె.యు. రెండవ గేటు నుండి మార్నింగ్ వాక్ కార్యక్రమం కొనసాగింది. ఈ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు జార్జ్ రెడ్డి అమర్ రహే,జీనా హైతో మర్ నా సిఖో- కదం కదం ఫర్ లడ్ నా సిఖో అంటూ జార్జ్ అమరత్వాన్ని స్మరిస్తూ కదం తొక్కారు.అనంతరం కె.యు. మొదటి ముందు జార్జి రెడ్డి చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించి, సంస్మరణ సభ నిర్వహించారు.ఈసందర్భంగా జరిగిన సభకు ముఖ్య వక్తలుగా తెలంగాణ ప్రగతిశీల ఉపాధ్యాయ సంఘం(టి.పి.టి.ఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్, పి.డి.ఎస్.యు. పూర్వ విద్యార్థి రాష్ట్ర నాయకులు నున్న అప్పారావు, ఎం.డి నబీ (అడ్వకేట్), రాచర్ల బాలరాజు, పి.డి.ఎస్.యు.జాతీయ అధ్యక్షులు మొగిలి వెంకటరెడ్డి, పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వి లు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రశ్నించే వారిని అర్బన్ నక్సల్స్ గా, మత ఉన్మాదులను దేశ భక్తులుగా చిత్రీకరించి మతోన్మాద ఫాసిజాన్ని పెంచి పోషిస్తున్నదని, ఇది దేశ ప్రజల ఐక్యతకు, దేశ లౌకిక వ్యవస్థకు, భిన్నత్వంలో ఏకత్వ స్ఫూర్తికి పెను ప్రమాదకరంగా మారుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మోడీ మతోన్మాదానికి, డోనాల్డ్ ట్రంప్ సామ్రాజ్యవాద యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు.నేటి విద్యార్థులంతా శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుని ప్రగతిశీల భావజాల వ్యాప్తికై కృషి చేయాలన్నారు. దేశంలోని పేదలందరికీ ఉచితంగా నాణ్యమైన సమాన విద్య, వైద్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం సంఘటితమై విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. పూర్వ విద్యార్థులు ప్రశాంత్, రంజిత్, విష్ణు లతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా విప్లవ విద్యార్థి సంఘాల (పి.డి.ఎస్.యు) నేతలు బి. నరసింహారావు, రాచకొండ రంజిత్ కుమార్, గుర్రం అజయ్, మర్రి మహేష్, బోయినపల్లి అజయ్,బి.వంశీ, అర్జున్, వి.కావ్య, పి.అనూష, దండు వినయ్, సంగీత, శివ, ఆదర్శ్ ,బీక్షిత్, అనిల్ రాంబాబు, పవన్, సాయి, గణేష్, హర్షిత, చందన, నందు, సిద్ధార్థ్, సద్దాం,చందు, అక్షర, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

**కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**




కొత్తగూడెం (తెలంగాణ వాణి) ఉద్యోగుల బాగోగులు సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదిని కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాష అన్నారు . మంగళవారం పిఆర్టియు ఆధ్వర్యంలో నిర్వహించిన రెండురోజుల దీక్ష శిబిరాన్ని సందర్శించి వారు ప్రసంగించారు. ప్రభుత్వం లో భాగంగా ఉండి రాష్ట్ర అభివృద్ధి లో భాగస్వామ్యం అయిన ఉపాధ్యాయ,ఉద్యోగుల ఇబ్బందులను గుర్తించి పరిష్కరించలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద ఉందని అన్నారు. తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఐక్య పోరాట, ఉద్యమాలే సమస్యల పరిష్కారానికి మార్గమని పేర్కొన్నారు.ప్రజా సమస్యలు అయినా, ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అయినా ఐక్య పోరాట ఉద్యమాలే సమస్యల పరిష్కారానికి మార్గమన్నారు. గత రెండు సంవత్సరాల నుండి ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నోచుకోక పోవడం శోచనీయం అని అన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు చేపట్టిన ఉద్యమం చరిత్ర ను మలుపు తిప్పిందని, అటువంటి వారి సమస్యలు పరిష్కరించటానికి ప్రభుత్వం కాలయాపన చేయటం సరికాదన్నారు. సిపిఐ పార్టీ మీ సమస్యల పరిష్కారానికి మీతో ఈ విధమైన పోరాటం చేయటానికి సిద్ధంగా ఉన్నామని సహకరిస్తామని అన్నారు.రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఈ డబ్ల్యూ జి వెస్లీ , కోటేశ్వర రావు , రిటైర్ పోలీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు , విద్యానగర్ సర్పంచ్ శాంతి ప్రసాద్ , ఉప సర్పంచ్ మురళి , ఏఐటీయూసీ సెక్రటరీ వెంకట్, కొత్తగూడెం సిపిఐ సెక్రటరీ జమలయ్య , ఇమంది ఉదయకుమార్ , ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు లాల్ మొహమ్మద్ ఈ సందర్భంగా పలువురు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

## రోజా సెకండ్ ఇన్నింగ్స్...

**చెన్నై,** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి రోజా వేరే ఆలోచనతో ఉన్నట్టు కనిపిస్తున్నారు. ముఖ్యంగా తమిళ రాజకీయాలను ఒక ఆప్షన్ గా పెట్టుకున్నారు. ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తనను విస్మరిస్తే వెంటనే తమిళ రాజకీయాల్లోకి వెళ్లాలని ఆలోచన చేస్తున్నట్టు ఉన్నారు. ఎందుకంటే రోజాకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో వచ్చే ఎన్నికల్లో సీటు దక్కుతుందా లేదా అనే అనుమానాలు ఉన్నాయి. ఎందుకంటే ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న నగిరిలో టిడిపి పట్టు బిగిస్తోంది. మరోవైపు రోజా నాయకత్వాన్ని స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ క్యాడర్ వ్యతిరేకిస్తోంది. అందుకే జగన్మోహన్ రెడ్డి పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్యలాంటివి. అందుకే టిక్కెట్ల విషయంలో ఎటువంటి మొహమాటాలకు పోదలుచుకోలేదు జగన్మోహన్ రెడ్డి.మొన్నటి ఎన్నికల్లోనే రోజాకు నగిరి టికెట్ వస్తుందా లేదా అన్న అనుమానాలు వెంటాడాయి. అయితే ఈసారి తప్పకుండా రోజాను తప్పించాల్సిందేనని ఆ జిల్లాకు చెందిన సీనియర్ మాజీమంత్రి ఒకరు గట్టిగానే జగన్మోహన్ రెడ్డిని కోరుతున్నట్లు తెలుస్తోంది. మొన్నటి ఎన్నికల్లోనే రోజాకు టికెట్ వద్దని వారించారట. కానీ ఆమెకు టికెట్ ఇవ్వకపోతే నెగిటివ్ ఫీడ్బ్యాక్ వెళుతుందని భావించి జగన్మోహన్ రెడ్డి ఆమెకు టికెట్ ఇచ్చారు. అయితే ఈసారి మాత్రం ఆమెకు టికెట్ లేదని స్పష్టంగా తెలుస్తోంది. అందుకే సెకండ్ ఆప్షన్ గా రోజా తమిళ రాజకీయాలను ఎంపిక చేసుకున్నారు. తాజాగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అధికార డిఎంకె తరఫున ప్రచారం చేస్తున్నారు రోజా. ఇదంతా ముందు చూపులో భాగమేనని పొలిటికల్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.రోజా భర్త సెల్వమణి తమిళ దర్శకుడు. అక్కడ సినిమా రంగంతో పాటు రాజకీయ రంగాల్లో ఆయనకు పరిచయాలు ఎక్కువ. రోజా సైతం తమిళనాడులో నటిగా గుర్తింపు పొందారు. ఆమె ఆది నుంచి సీఎం స్టాలిన్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ వస్తున్నారు. ఆమెను స్టాలిన్ సోదరిగా చూస్తారు. ఒకవేళ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏపీలో మొండి చేయి చూపితే.. వెంటనే తమిళ రాజకీయాల్లో ఎంట్రీ ఇవ్వాలని రోజా భావిస్తున్నారట. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం భిన్నంగా ఆలోచిస్తోంది ఆమె విషయంలో. ఒకవేళ పార్టీలో కొనసాగితే కొనసాగని.. లేకుంటే వెళ్లిపోని అని సింపుల్ గా తీసుకుంటుందట.

## తమిళ ఎన్నికలకు ధురంధర్ లింక్

**చెన్నై,** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటీఫికేషన్ ఇచ్చింది. ఇందులో మూడు రాష్ట్రాలు కేరళ, పాండిచ్చేరి, అస్సాం రాష్ట్రల ఎన్నికలు ముగిశాయి. తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండు రాష్ట్రాలు చాలా కీలకంగా మారాయి. బెంగాల్‌లో పాగా వేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. ఇక తమిళనలడులో అన్నాడీఎంకేతో కలిసి పోటీ చేస్తోంది. ఇక్కడ నామినేషన్లు పూర్తయ్యాక అన్ని పార్టీలు ప్రచారంపై దృష్టి పెట్టాయి. డీఎంకే, ఏఐఏడీఎంకె లాంటి ద్రవిడ పార్టీలు ఓటర్లను ఆకర్షించేందుకు వ్యూహాలు రూపొందిస్తుంటే, హిందీ సినిమా 'దురంధర్' ద్రవిడవాద పార్టీను భయపెడుతోంది.దురంధర్ సినిమా అంటే పాకిస్తాన్ భయపడాలి. ఇందులో భారత దేశభక్తి, పాకిస్తాన్‌లో మన ఏజెంట్లు చేస్తున్న ఆపరేషన్లతో ఇప్పటికే పాకిస్తాన్ హడలెత్తిపోతోంది. సినిమాను నిషేధించింది.

తమిళనాడులోని ద్రవిడవాద పార్టీలు సినిమా విడుదలను ఆపమని కోర్టుల్లో పిటిషన్లు వేశాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో కూడా రిలీజ్ చేయవద్దని డిమాండ్ చేశాయి. ఎన్నికలయ్యే వరకు ఆపాలని వాదించాయి, ఎందుకంటే సినిమా బీజేపీకి అనుకూల ఓట్లు తెచ్చి, మిత్రపక్షాలకు లాభం చేస్తుందని భావిస్తున్నాయి.సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కోర్టు పిటిషనర్లు పార్టీ ప్రయోజనాలు ప్రభావితం చేసే సీన్లు న్యాయస్థానానికి చూపించలేకపోయాయి. సినిమాలో భారత గొప్పతనం, పాకిస్తాన్ రహస్య కార్యకలాపాలు మాత్రమే ఉన్నాయని, ఎన్నికలపై ప్రభావం లేదని కోర్టు తీర్పు ఇచ్చింది. సాక్ష్యాలు లేకుండా విడుదల ఆపడం అన్యాయమని న్యాయస్థానం పేర్కొంది.దేశభక్తి అంశాలు బీజేపీకి మాత్రమే లాభమని ద్రవిడ, విపక్ష పార్టీలు భావిస్తున్నాయి.



# కెరీర్‌పై మళ్లీ ఫోకస్

'మెంటల్ మదిలో', 'చిత్రలహరి' వంటి చిత్రాలతో టాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకున్న నివేదా పేతురాజ్, వ్యక్తిగత కారణాలతో సినిమాలకు విరామం ఇచ్చి ఇప్పుడు మళ్లీ కెరీర్‌పై దృష్టి సారించింది. ఒకప్పుడు వరుస అవకాశాలతో బిజీగా ఉన్న ఈ నటి, బిజినెస్ మేన్ రజిత్ ఇబ్రాన్‌తో ప్రేమలో పడి 2023లో వెండితెరకు దూరమయింది. పెళ్లి చేసుకోబోతున్నట్టు ఇద్దరూ హింట్ కూడా ఇచ్చారు. ఈ తరుణంలో మనస్పర్థల కారణంగా వీరిద్దరూ విడిపోయారు. తాజాగా రజిత్ మరో అమ్మాయితో నిశ్చితార్థం చేసుకోవడంతో, నివేదా తన గతాన్ని వదిలేసి మళ్లీ సినిమాల్లో బిజీ అవ్వాలని నిర్ణయించుకుంది. గతంలో స్టార్ హీరోలతో నటించిన నివేదా... ఇప్పుడు కథలో ప్రాధాన్యత ఉన్న ఎలాంటి పాత్రనైనా (క్యారెక్టర్ రోల్స్) చేయడానికి సిద్ధమని మేకర్స్‌కు సందేశాలు పంపుతున్నట్టు సమాచారం. ప్రేమ కోసం, ఎదుగుతున్న కెరీర్‌ను పణంగా పెట్టిన నివేదా పరిస్థితిని చూసి నెటిజన్లు సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. ప్రతిభ ఉన్న నటి కాబట్టి ఆమెకు మంచి కమ్‌బ్యాక్ లభిస్తుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్
# మూవీ క్రేజీ అప్‌డేట్

**- అలియా భట్, షాహిద్ కపూర్‌లతో భారీ స్కెచ్!**



గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ (వర్కింగ్ టైటిల్: డ్రాగన్) కోసం చిత్రబృందం భారీ తారాగణాన్ని రంగంలోకి దింపుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత ఎన్టీఆర్-అలియా జోడీని మళ్ళీ వెండితెరపై చూడాలని ఆశపడుతున్న అభిమానులకు ఇది తీపి కబురు. ఇప్పటికే చిత్రబృందం ఆమెతో సంప్రదింపులు జరిపిందని, అలియా కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు, ఈ సినిమాలో పవర్‌ఫుల్ విలన్ పాత్ర కోసం బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మొదట ఈ పాత్ర కోసం మలయాళ నటుడు టొవినో థామస్‌ను అనుకున్నప్పటికీ, డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఆయన తప్పుకున్నారు. ఇప్పుడు షాహిద్ కపూర్‌ను విలన్‌గా చూపించి పాన్-ఇండియా స్థాయిలో సినిమాపై అంచనాలు పెంచాలని ప్రశాంత్ నీల్ ప్లాన్ చేస్తున్నారట. ఈ భారీ తారాగణంపై అధికారిక ప్రకటన వస్తే, ఈ ప్రాజెక్ట్ బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టించడం ఖాయమని అభిమానులు అంటున్నారు.

# 'థ్రాష్' మూవీ రివ్యూ!



హాలీవుడ్ నుంచి వచ్చే సర్వైవల్ థ్రిల్లర్ సినిమాలకి ఓటీటీలలో మంచి డిమాండ్ ఉంది. ఈ జోనర్ కి సంబంధించిన కథలను హాలీవుడ్ మేకర్స్ చాలా ఇంట్రెస్టింగ్ గా తెరకెక్కిస్తారనే ఒక బలమైన నమ్మకం ప్రేక్షకులలో ఉంది. అలాంటి జోనర్లో రూపొందిన సినిమానే 'థ్రాష్'. టామీ విర్కోలా దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ నెల 10వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతోంది. నేరుగా ఓటీటీకి వచ్చిన ఈ సినిమా కథేమిటనేది ఇప్పుడు చూద్దాం. అది 'అట్లాంటిక్' సముద్రతీర ప్రాంతం. ఆ తీర ప్రాంతానికి ఆనుకుని ఉన్న నగరాలలో నెమ్మదిగా వర్షం మొదలవుతుంది. మరికొన్ని గంటలలో 'హరికేన్' విరుచుకుపడనుందని అక్కడి ప్రభుత్వం హెచ్చరికలు జారీచేస్తుంది. ప్రజలంతా సురక్షిత ప్రాంతాలను విడిచి రావొద్దని ప్రకటిస్తుంది. అయితే అప్పటికే కార్లో బయటికి వచ్చిన 'లీసా' (ఫోబ్ డైనేవర్)కి విషయం అర్థమయ్యేసరికి ఆలస్యమవుతుంది. ఆమె నిండు గర్భవతి. అందువలన సాధ్యమైనంత త్వరగా అక్కడి నుంచి బయటపడాలని అనుకుంటుంది. ఉప్పెన కారణంగా నగరాలపై సముద్రం విరుచుకు పడుతుంది. దాంతో సముద్రంలోని ప్రమాదకరమైన సొరచేప (షార్క్)లు నగరాలలోకి కొట్టుకుని వచ్చేస్తాయి. నీళ్లలోకి అడుగుపెట్టిన మరుక్షణమే అవి వాళ్లను చంపేస్తూ ఉంటాయి. అలాంటి పరిస్థితులలో 'లీసా' ఆ తుఫానులో చిక్కుకుపోతుంది. ఒక చెట్టుకొమ్మ కారణంగా ఆమె ఆ కారులో నుంచి దిగే అవకాశం లేకుండా పోతుంది. అక్కడికి కాస్త దూరంలోనే 'డకోటా'(విట్నీ పీక్) ఇల్లు ఉంటుంది. ఆ ఇంటి మొదటి అంతస్తువరకూ నీళ్లు వచ్చేస్తాయి. ఆమెను రక్షించడం కోసం ఆమె మేనమామ ఒక బోట్ పై బయల్దేరతాడు. షార్క్ లపై పరోశోధన చేస్తున్న ఆయనకి, వాటిని ఎలా నియంత్రించాలనేది తెలుసు. ఆయన కోసం డకోటా ఎదురుచూస్తూ ఉంటుంది. తన ఇంటికి ఎదురుగా చిక్కుకుపోయిన 'లీసా' కారు, నీటిలో మునిగిపోతుండటం చూస్తూనే ఉంటుంది. తాను గర్భవతిననీ .. తనని కాపాడమని డకోటాను 'లీసా' కోరుతుంది. ఆ మాట వినగానే డకోటా తీవ్రమైన ఆందోళనకి లోనవుతుంది. అయితే ఆ కారు చుట్టూ సొరచేపలు తిరుగుతుండటంతో ఆలోచనలో పడుతుంది. చివరికి 'లీసా'ను రక్షించాలనే నిర్ణయానికి వచ్చిన డకోటా, ధైర్యంతో నీటి ప్రవాహంలోకి దిగుతుంది. అప్పుడు ఏం జరుగుతుంది? లీసాను డకోటా కాపాడగలుగుతుందా? లీసా కడుపులోని బిడ్డ, ప్రాణాలతో బయటపడుతుందా? అనేది కథ. తుపాను .. సునామీ .. నేపథ్యంలో గతంలో చాలానే సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అలాంటి విపత్కర పరిస్థితులను ఎవరెవరు ఎలా ఎదుర్కున్నారనే దిశగా ఆ కథలు నడిచాయి. ఈ కథ విషయానికి వచ్చేసరికి, ఒక నిండు గర్భవతి ఇలాంటి ఒక 'ఉప్పెన'లో చిక్కుకుంటే ఎలా ఉంటుంది? ఆ ప్రళయం నుంచి బయటపడటానికి ఆమె ఏం చేస్తుంది? అనేది దర్శకుడు ఎంచుకున్న ఆసక్తికరమైన అంశంగా చెప్పుకోవాలి. సాధారణంగా నిండు గర్భవతికి ఏదైనా కష్టం వస్తేనే, చూసేవాళ్లు తట్టుకోలేకపోతారు. అలాంటి ఒక గర్భవతి ఉప్పెనలో .. కారులో చిక్కుకుపోతుంది. అంతకంతకూ నీటి మట్టం పెరుగుతూ పోతుంటుంది. సముద్రం నుంచి కొట్టుకొచ్చిన సొరచేపలు అక్కడ తిరుగుతుంటాయి. అందువలన ఆమెను రక్షించే సాహసం ఎవరూ చేయలేని పరిస్థితి. అలా అన్ని వైపుల నుంచి దర్శకుడు దిగ్బంధనం చేసిన తీరు ఉత్కంఠను పెంచుతుంది. ఈ కథలో ప్రధానమైనవిగా కనిపించే ప్రమాదకరమైన అంశాలు రెండు. ఒకటి హరికేన్ సృష్టించే విలయం అయితే, మరొకటి సముద్రపు నీటితో పాటు కొట్టుకొచ్చిన సొరచేపలు. ఈ రెండింటిని తెరపైకి తీసుకొచ్చిన తీరు ఆసక్తికరంగా అనిపిస్తుంది. హరికేన్ విరుచుకుపడే దృశ్యాలు .. సొరచేపలు దాడి చేసే దృశ్యాలు సహజత్వానికి చాలా దగ్గరగా అనిపిస్తాయి. విలయాన్ని ప్రత్యక్షంగా చూస్తున్న ఫీలింగును కలిగిస్తాయి. సముద్రం అల్లకల్లోలంగా మారడం .. నగరాలపై విరుచుకు పడటం .. ఇళ్లలోకి వరద వచ్చేయడం వంటి సన్నివేశాలను తెరపైకి తీసుకొచ్చిన విధానం ఆశ్చర్యచకితులను చేస్తాయి. సొరచేపల మధ్యలో ఉన్న గర్భిణీ స్త్రీని కాపాడటానికి 'డకోటా' వెళ్లే సన్నివేశం .. తనని తాను కాపాడుకుంటూ, అప్పుడే పుట్టిన పసికందును రక్షించుకోవడం కోసం సొరచేపలతో ఓ తల్లి చేసే పోరాటం ఈ సినిమా హైలైట్స్ లో మనకి కనిపిస్తాయి. ఈ సినిమాలో మరికొన్ని పాత్రలు ఉన్నప్పటికీ, ప్రధానంగా కనిపించేది ఫోబ్ డైనేవర్ - విట్నీ పీక్. ఈ ఇద్దరి నటన ఆడియన్స్ కి కనెక్ట్ అవుతుంది. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ కథకి మరింత బలాన్ని చేకూర్చాయి. గర్భిణీ స్త్రీకి సంబంధించిన ప్రధానమైన అంశం ఎమోషనల్ గా కనెక్ట్ అయినప్పటికీ, కంటెంట్ మొత్తంగా చూసుకుంటే మాత్రం రొటీన్ గానే అనిపిస్తుంది. షార్క్ చేపల దాడి .. రక్తపాతం గల ఈ సినిమాను, పిల్లలతో కాకుండా చూడటమే కరెక్ట్ అనిపిస్తుంది.

## భరతవర్ష మరుగున పడ్డ
# యోధుడి కథ



అగ్ర హీరో గోపీచంద్ కథానాయకుడిగా రూపొందుతున్న ప్రతిష్టాత్మక చారిత్రక యాక్షన్ డ్రామా 'భరతవర్ష'. రీతూవర్మ కథానాయిక. సంకల్ప్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి శ్రీనివాస చిట్టూరి నిర్మాత. గోపీచంద్ కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రమిదని మేకర్స్ చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఓ పవర్‌ఫుల్ గ్లింప్స్ ద్వారా ఈ సినిమా టైటిల్‌ని నిర్మాతలు విడుదల చేశారు. క్రీ.శ 642 నేపథ్యంలో సాగే ఈ గ్లింప్స్ అద్భుతమైన యాక్షన్ సీన్స్‌తో కట్టిపడేసింది. భారీ యుద్ధ సన్నివేశాలు, ఆరితేరిన యోధుల క్లోజప్ షాట్స్. కత్తులు, గొడ్డళ్లు, అగ్నిజ్వాలల మధ్య జరిగే పోరాటాలు కనువిందు చేశాయి. భారతభూమికి ప్రతీకగా 'భరతవర్ష' అనే టైటిల్ రివీల్ కావడం కథపై ఆసక్తిని రేకెత్తించింది. దేశ చరిత్రలో మరుగున పడిన ఓ అధ్యాయాన్ని దర్శకుడు సంకల్పరెడ్డి గొప్పగా ఆవిష్కరిస్తున్నారని, భావోద్వేగపూరిత కథా, కథనాలు, యాక్షన్ సన్నివేశాలతో సినిమా రూపుదిద్దుకుంటున్నదని నిర్మాతలు తెలిపారు. హీరో గోపీచంద్ యోధుడి పాత్ర కోసం తన శారీరకభాషను పూర్తిగా మార్చుకున్నారని, ఇందులో ఆయన ఫిజిక్, అభినయం, స్క్రీన్ ప్రజెన్స్ అద్భుతంగా ఉంటాయని, గత చిత్రాలకు భిన్నంగా గోపీచంద్ కనిపిస్తారని, చిత్రీకరణ చివరి దశకు చేరుకున్నదని, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సౌందర్‌రాజన్, సంగీతం: అనుదీప్ దేవ్, సమర్పణ: పవన్‌కుమార్, నిర్మాణం: శ్రీనివాస సిల్వర్ స్క్రీన్.

## పోచమ్మ
# ఆగ్రహం



అంబటి అర్జున్, శ్రీపూజారెడ్డి, స్నేహ కీలక పాత్రలు పోషించిన వెబ్‌సిరీస్ 'పోచమ్మ'. మిస్టీరియస్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సిరీస్‌కు రమేశ్ ఇంద్ర దర్శకుడు. శ్రుతి నాయుడు నిర్మాత. ఈ నెల 17 నుంచి ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆహాలో స్ట్రీమింగ్ కానున్నది. ఈ సందర్భంగా ఈ సిరీస్‌కి చెందిన ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఆహ్లాదకరమైన అటవిప్రాంతంలో ఓ అందమైన ఇల్లు.దఆ ఇంటిముందే పోచమ్మతల్లి గుడి. ఆ తల్లిని పూజిస్తున్న జనం. ఆ ఇంటినీ, ఆ ప్రాంతాన్ని ఆ తల్లి కాపాడుతుంటుంది. అలాంటి తల్లి గుడినీ, ఆమె విగ్రహాన్ని తొలగిస్తే ఆ తల్లి ఊరుకుంటుందా? ఆ తప్పు చేసిన వారిని పోచమ్మ ఎలా శిక్షించింది? అనేది ట్రైలర్‌లో రోమాంచితంగా చూపించారు. ఓ యువజంట ప్రేమ.. దానికి అడ్డుపడే కొందరు వ్యక్తుల్ని కూడా ట్రైలర్‌లో చూడొచ్చు. థ్రిల్లింగ్, డివైన్ ఎలిమెంట్స్‌తో ట్రైలర్ సాగింది.

# స్వరరాగాల సుర సుర..



ప్రసిద్ధ దేవాలయాల్లో నిక్షిప్తమై ఉండే నేలమాళిగలు, వాటిలో దాగుండే నిధి నిక్షేపాలు, వాటి వెనుక రహస్యాలు, దైవ నిర్ణయాలు.. తదితర అంశాల కలబోతగా రూపొందుతున్న పానిండియా మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ 'నాగబంధం'. విరాట్‌కర్ణ కథానాయకుడిగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి కిశోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మాతలు. నభా నటేష్, ఐశ్వర్యమేనన్ కథానాయికలు. జులై 3న సినిమా విడుదల కానున్నది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా నుంచి రెండో పాటను ఈ నెల 19న విడుదల చేయనున్నారు. 'సుర సుర' అంటూ సాగే ఈ పాటను.. సంప్రదాయ పెళ్లి సంబరాల ఆనందోత్సాహాలను ప్రతిబింబించేలా భారీ సెట్స్, గ్రాండ్ విజువల్స్‌తో రూపొందించారు.

జునైద్ కుమార్ అభే సంగీతం, గణేశ్ ఆచార్య కొరియోగ్రఫీ ఈ పాటకు హైలైట్స్‌గా నిలువనున్నాయి. అనురాగ్ కులకర్ణి, కాలభైరవ, మంగ్లీ, సాహితి చాగంటి, కనకవ్వ, నల్గొండ గద్దర్ ఈ పాటను ఆలపించగా, కాసర్ల శ్యామ్ రాశారు. ఈ సినిమాకే ఈ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com